16, 17 తేదీల్లో సీసీఐ పత్తి కొనుగోలు బంద్

- రైతులు పత్తిని తీసుకురావద్దు : సీసీఐ

నవతెలంగాణ-మద్నూర్



మార్కెట్ కమిటీ పరిధిలో సీసీఐ కొనుగోలు 16,17 తేదీల్లో రెండు రోజుల పాటు బంద్ ఉంటాయని సీసీఐ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 16న శనివారం, 17న ఆదివారం రెండు రోజులు కొనుగోలు ఉండవని సిసిఐ కొనుగోళ్లకు రైతులు పత్తిని ఈ రోజుల్లో తీసుకురాకూడదని అధికారులు సూచించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
శుక్రవారం నవంబర్ 15, 2024 www.navatelangana.com

సాగును సరళతరం చేయడమే లక్ష్యం

- వ్యవసాయ ఆధునిక పద్ధతులపై విద్యార్థుల ప్రదర్శన

నవతెలంగాణ-సదాశివ నగర్



ప్రదర్శన పరిశీలన

మండలంలోని అడ్లూరు ఎల్లారెడ్డి గ్రామంలోని రైతు వేదికలో గురువారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను విద్యార్థులు ప్రదర్శించారు. విద్యార్థులు రూరల్ అగ్రికల్చర్ వర్క్ ఎక్స్పీరియన్స్ ప్రోగ్రాం కార్యక్రమంలో అద్భుతంగా ప్రదర్శించారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పరిచయం చేసినట్టు తెలిపారు. వ్యవసాయ రంగంలో సరళతరం చేసే విధానాలను ప్రోత్సహించడం లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో డాట్ సెంటర్ శాస్త్రవేత్తలు అనిల్‌రెడ్డి, రేవంత్, జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, సింగిల్ విండో చైర్మన్ సదాశివరెడ్డి, మండల వ్యవసాయ అధికారి ప్రజాపతి, ఇర్షాదుద్దీన్, కిసాన్ సంఘ్ అధ్యక్షులు సంకరి శ్రీనివాస్, ఆకుల సిద్ధి రాములు రైతులు పాల్గొన్నారు.

రైతుకు నష్టం చేకూర్చొద్దు

- అవినీతి జరగకుండా నిరంతరం పర్యవేక్షణ.. ప్రతికేంద్రానికో ప్రత్యేకాధికారి
- తరుగు, కడ్తా పేరిట కోతలు విధిస్తే కఠిన చర్యలు
- జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు
- ధాన్యం కొనుగోలు కేంద్రాల సందర్శన
- సన్నాలకు అదనంగా రూ.500 బోనస్ చెల్లిస్తామని వెల్లడి



ఆర్మూర్‌లో తూకం తీరు పరిశీలిస్తున్న మంత్రి..



డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లిలో..

నవతెలంగాణ-డిచ్‌పల్లి/ఆర్మూర్/ఎడపల్లి/నిజామాబాద్‌సిటీ

ఆరుగాలం శ్రమించి పంట సాగు చేసిన రైతు పంట అమ్మకాల సందర్భంగా ఏ దశలోను నష్టపోకుండా తమ ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ఇందు కోసం ధాన్యం కొనుగోళ్ల పర్యవేక్షణకు ప్రతి కేంద్రానికి ఓ అధికారిని కేటాయించినట్టు తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో గురువారం స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి మంత్రి జూపల్లి సుడిగాలి పర్యటన చేపట్టారు. మొదట డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లి, ఆర్మూర్ మండలం పెర్కిట్, ఎడపల్లి మండలం ఠాణాకలాన్ లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి, రైతుల నుంచి ధాన్యం సేకరిస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలలో రైతుల సౌకర్యార్థం అందుబాటులో ఉన్న సదుపాయాలు తనిఖీ చేశారు. మాయిశ్చర్ మీటర్ ద్వారా ధాన్యం తేమ శాతాన్ని మంత్రి స్వయంగా కొలిచారు. కేంద్రాలకు ధాన్యం తెచ్చిన రైతులను పలకరించి, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. రైతుల నుండి సేకరించిన ధాన్యం వివరాలతో కూడిన రికార్డులను పరిశీలించారు. అనంతరం జిల్లా కేంద్రంలో కొనుగోలుపై సమీక్షించారు.

మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే వారికి మద్దతు ధర, బోనస్, ధాన్యం రకం, ఎంత పరిమాణంలో ధాన్యం సేకరించారు, బిల్లు రూపేణా ఎంత మొత్తం చెల్లించబడుతుంది తదితర అన్ని వివరాలు పొందుపరుస్తూ రైతుకు సంబంధిత అధికారి సంతకంతో కూడిన రసీదు అందించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రం నుండి ధాన్యం నిల్వలు రైస్ మిల్లుకు రవాణా చేయడానికి ముందే విధిగా రైతుకు రశీదు ఇవ్వాలన్నారు. దీనివల్ల రైతులు రైస్ మిల్లుల వద్ద కోతల పేరిట నష్టపోకుండా నిలువరించవచ్చని సూచించారు. ఎక్కడ కూడా తరుగు, కడ్తా పేరుతో కోతలు విధించకుండా పకడ్బందీగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల పర్యవేక్షణ కోసం ప్రతి కేంద్రానికి ఒక అధికారి చొప్పున నియమించాలని, అవసరమైతే ఇతర శాఖల అధికారులకు ధాన్యం సేకరణపై శిక్షణ ఇచ్చి వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు.



ఆర్మూర్‌లో మంత్రికి స్వాగతం..

ఎట్టి పరిస్థితుల్లోనూ ఏ ఒక్క రైతు నష్టపోవడానికి వీలు లేదని, దళారీల ప్రమేయం లేకుండా చూడాలని అన్నారు. రైతుకు నష్టం చేకూర్చే చర్యలను ఎంతమాత్రం ఉపేక్షించబోమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా మంత్రి హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, లోపాలు పునరావృతం కాకుండా నిరంతరం ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను నిశితంగా పర్యవేక్షణ జరుపుతున్నామని అన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ. 2320 తో పాటు సన్నాలకు ప్రభుత్వం రూ.500 బోనస్ చెల్లిస్తుందని, ఏ విషయంలో రైతులు ఎలాంటి అనుమానాలకు గురి కావాల్సిన అవసరం లేదని మంత్రి జూపల్లి భరోసా కల్పించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు నిరీక్షించాల్సిన పరిస్థితి లేకుండా వెంటవెంటనే కాంటాలు జరపాలని, బిల్లుల చెల్లింపులలో జాప్యానికి తావులేకుండా త్వరితగతిన టాబ్ ఎంట్రీలు చేయాలని అధికారులను ఆదేశించారు. పూర్తి పారదర్శకంగా, స్పష్టతను పాటిస్తూ రైతుల నుంచి ఏ చిన్న ఫిర్యాదుకు సైతం ఆస్కారం లేకుండా కొనుగోలు కేంద్రాలను సజావుగా నిర్వహించాలని హితవు పలికారు.

కాగా, 75 సంవత్సరాల కాలంలో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు 60 వేల కోట్ల అప్పులు మాత్రమే చేయగా, గత ప్రభుత్వం పదేళ్ల పాలనలోనే 8 లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసిందని, మంత్రి జూపల్లి ఆక్షేపించారు. ఈ అప్పులపై వడ్డీ రూపంలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం ప్రతీ నెలా రూ. 6వేల కోట్లు చెల్లిస్తోందని తెలిపారు. ఇలా తీవ్రమైన ఆర్థిక భారం ఉన్నప్పటికీ, ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఉచిత విద్యుత్,మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం, రూ.500 లకు వంట గ్యాస్, రైతులకు పంట రుణాల మాఫీ తదితర వాటన్నింటిని అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ అర్హులైన రైతులకు రైతు భరోసా కింద తప్పనిసరిగా లబ్ది చేకూరుస్తామని స్పష్టం చేశారు. సుమారు 20 వేల కోట్లను వెచ్చిస్తూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకం కింద ప్రతి నియోజకవర్గానికి మొదటి విడతగా 3500 గృహాలను ప్రభుత్వం మంజూరు చేయనుందని తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రతిష్ఠను దిగజార్చాలనే కుట్రతో ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నాయని దుయ్యబట్టారు.

ఇంటింటి సర్వే పరిశీలన

కాగా, అన్ని వర్గాల ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతుల విశ్లేషణ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియను మంత్రి జూపల్లి కృష్ణారావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లిలో సర్వే ద్వారా వివరాలు సేకరిస్తున్న తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. జనాభా ప్రాతిపదికన అన్ని వర్గాల వారికి సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా లబ్ది చేకూర్చేందుకే ప్రభుత్వం సమగ్ర సర్వే జరిపిస్తోందని అన్నారు. అనంతరం స్థానిక రైతు వేదికలో మంత్రి రైతులతో భేటీ అయ్యారు. మంత్రి వెంట ఎమ్మెల్యేలు పి.సుదర్శన్ రెడ్డి, డాక్టర్ భూపతి రెడ్డి, పి.రాకేష్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, తదితరులు ఉన్నారు.

బాల్యంలోనే.. బాధ్యతలు

- బాలల దినోత్సవం నాడు చిన్నారుల కష్టాలు

నవతెలంగాణ-బోధన్



బోధన్ పట్టణంలో సుత్తేపట్టి పని చేస్తున్న బాలిక

దేశవ్యాప్తంగా గురువారం ఒకవైపు బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించుకుంటుంటే.. మరోవైపు సంచార జీవితం గడుపుతున్న బాలలు చదువు లేక అమ్మా నాన్నకు తోడుగా సంచార జీవితం గడుపుతూ చిన్న వయసులోనే కష్టపడుతున్నారు. బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లిలో బాలల దినోత్సవం నాడు సంచర జీవనం గడుపుతున్న ఒక కుటుంబానికి చెందిన ఓ బాలిక ఆమె తల్లిదండ్రులకు చేదోడువాదులుగా ఉంటూ చిన్న వయసులోనే సుత్తి చేతబట్టి పనిచేసిన దృశ్యం నవతెలంగాణ కంటబడింది. పాఠశాలల్లో విద్యార్థులు బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించుకుంటుంటే ఓవైపు ఇలాంటి చిన్నారులు పొట్టకూటి కోసం తమ బాల్యాన్ని కోల్పోతున్నారు. ప్రభుత్వాలు మారినా.. పాలకులు మారినా వీరి దుర్భర జీవనం మాత్రం మారడం లేదు. ప్రభుత్వం ఇలాంటి సంచర జీవితం గడుపుతున్న బాలలను చేరదీసి విద్యాబుద్ధులు నేర్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ఏసీబీ వలలో ఎస్ఐ, కానిస్టేబుల్

- స్టేషన్ బెయల్ కోసం పది వేలు లంచం

నవతెలంగాణ-లింగంపేట్

స్టేషన్ బెయిల్ కోసం రూ.10 వేల లంచం తీసుకుంటుండగా.. లింగంపేట్ ఎస్ఐ అరుణ్ కుమార్‌ను, కానిస్టేబుల్ రామస్వామిని గురువారం ఏసీబీ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంది. ఏసిబి నిజామా బాద్ డిఎస్పి శేఖర్ గౌడ్ వివరాల ప్రకారం.. లింగం పేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తిపై గతంలో పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది.



పట్టుబడ్డ ఎస్ఐ, కానిస్టేబుల్

వివరాలు మెయిన్‌లో..

మంత్రి పర్యటనలో ఫ్లెక్సీవార్

వివరాలు మెయిన్‌లో..

- ఎంపీ, ఎమ్మెల్యే ఫొటో పెట్టలేదని బీజేపీ నాయకుల వాగ్వాదం

నవతెలంగాణ-ఆర్మూర్



నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణరావు పర్యటనలో రచ్చరచ్చ జరిగింది. ప్రొటోకాల్ ప్రకారం ఫ్లెక్సీలో బీజేపీ ఎంపీ అరవింద్, ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ఫొటోలో పెట్టలేదని బీజేపీ నాయకులు వాగ్వాదానికి దిగగా.. బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకుంది. మంత్రి పర్యటనలో భాగంగా ఆర్మూర్ పరిధిలోని పెర్కిట్ వద్ద కొనుగోలు కేంద్రానికి వచ్చారు.

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న రైతులు

నవతెలంగాణ-పోతంగల్

వరి ధాన్యం కొనుగోలు సక్రమంగా జరగడం లేదని, ఆలస్యంగా జరుగుతుండటంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోయారు. మండలంలోని కల్లూర్ గ్రామంలో రైతులు.. పోతంగల్ – బీర్కూర్ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. రైతులను గోడు పట్టించుకొని, కొనుగోలులో వేగం పెంచి ఆదుకోవాలన్నారు. రబీ పంటలకు సిద్ధమవ్వాల్సి ఉండగా.. ఇంకా ధాన్యం విక్రయించుకోకపోవడంతో దీని చుట్టూ తిరగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యం జరుగుతుందని, వేగంగా కొనుగోలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు రైతులను సముదాయించి రాస్తారోకో విరమింపజేశారు.

రిజిస్ట్రేషన్ సేవలు కొనసాగుతున్నాయ్

- నిలిపివేసినట్లు వస్తున్న వార్తలు అవాస్తవం : డీఐజీ రమేశ్ రెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాలలో సేవలు నిలిపివేసినట్లు వస్తున్న వార్తలు అవాస్తవమైనవని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నిజామాబాద్ డీఐజీ రమేశ్ రెడ్డి, జిల్లా రిజిస్ట్రార్ ప్రసూన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని పది రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సేవలు అందించడానికి అధికారులు సిద్ధంగా ఉన్నారని వారు పేర్కొన్నారు. కార్యాలయ సిబ్బంది ఎలాంటి బంద్‌లు పాటించడం లేదని స్పష్టం చేశారు. కొందరు దస్తావేజు లేఖర్లు మాత్రమే వారి సేవలను నిలుపేసుకున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, దానికి రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. జిల్లాలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాలన్నీ తెరిచి ఉన్నాయని కావున ప్రజలు ఇట్టి విషయాన్ని గమనించి నేరుగా సంబంధిత సబ్ రిజిస్ట్రార్లను సంప్రదించి యాదవిధిగా రిజిస్ట్రేషన్ సేవలు పొందవచ్చు అని తెలిపారు.

కాళేశ్వరానికి ప్రత్యేక బస్సులు : ఆర్టీసీ

నవతెలంగాణ-కామారెడ్డి

కార్తిక మాసం సందర్భంగా శైవ క్షేత్రాలకు కామారెడ్డి ఆర్టీసీ డిపో నుండి ప్రతి ఆదివారము ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్టు కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందిరా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాళేశ్వరం దేవస్థానం వరకు ఎక్స్ ప్రెస్ బస్సును వయా వేములవాడ, కరీంనగర్, మంథని మీదుగా ఉదయము 07.00 గంటలకు కామారెడ్డి కొత్త బస్సు స్టేషన్ నుండి బయలుదేరి మధ్యాహ్నం 12.30 గం లకు కాళేశ్వరం చేరనున్నట్టు తెలిపారు. కాళేశ్వరం నుండి సా. 04.00 గం.లకు తిరిగి కామారెడ్డికి బయలుదేరుతుందని తెలిపారు. టికెట్ ధర పెద్దలకు రూ..320, టికెట్ ధర పిల్లలకు రూ.160, ఇట్టి సౌకర్యాన్ని కామారెడ్డి చుట్టుపక్కల మండల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో వినియోగించుకోవాలని సూచించారు.

మతోన్మాద, విద్వేష శక్తుల నుంచి దేశాన్ని కాపాడుకుందాం

- 17న వామపక్ష పార్టీల సదస్సును జయప్రదం చేయండి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు పిలుపు

నవతెలంగాణ-వర్ని

మతోన్మాద, విద్వేష శక్తుల నుంచి దేశాన్ని రక్షించుకుందామని, తెలంగాణలో మతసమరస్యని కాపాడుకుందామనే అంశంపై ఈ నెల 17వ తేదీనా నిజామాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో జరిగే వామపక్ష పార్టీల సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు పిలుపు నిచ్చారు. వామ పక్ష, అభ్యుదయ, సామజిక, మానవ తవాదులు పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని కోరారు. గురువారం వర్ని మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాష్ట్ర శాసన సభ ఎన్నికల తరువాత తెలంగాణ లో మతపరమైన విభేదాలు పెంచేందుకు బిజెపి, ఆర్ ఎస్ ఎస్ తీవ్రమైన ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శిం చారు. జమిలి ఎన్నికల పేరుతో కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తుందని మండిపడ్డారు. మతోన్మాద రాజకీయాలను తెలంగాణ ఆంగీకరించబోదని అన్నారు. ప్రజలను చైతన్య వంతులుగా చేసేందుకు వామ పక్ష పార్టీలు సదస్సును ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి నన్నెసాబ్, లక్ష్మణ్, బొర్రా గంగాధర్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేశ్‌బాబు

జాతీయస్థాయి హాకీ పోటీలకు జడ్పీహెచ్‌ఎస్ గర్గుల్ క్రీడాకారులు

నవతెలంగాణ-కామారెడ్డి



ఎంపికైన విద్యార్థులు

68వ జాతీయ స్థాయి అండర్-17 బాలికల హాకీ టోర్నమెంట్‌కు మండలం గర్గుల్ జడ్పిహెచ్ఎస్ పాఠశాల క్రీడాకారులు ఎన్నికయ్యారు. 68వ రాష్ట్రస్థాయి హాకీ అండర్-17 బాలికల విభాగంలో నిజామాబాద్ లోని నభ్యభారతి గ్లోబల్ హై స్కూల్‌లో ఈనెల 11 నుంచి 13 వరకు జరిగిన క్రీడలలో ఎంపికయ్యారని ఫిజికల్ డైరెక్టర్ నోముల మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 23 నుంచి 27 వరకు హర్యానా రాష్ట్రంలో రొహుతక్‌లో జరిగే హాకీ టోర్నమెంట్‌లో పాల్గొనడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.ఎల్లయ్య, ఫిజికల్ డైరెక్టర్ నోముల మధుసూదన్‌రెడి, పాఠశాల ఉపాధ్యాయులందరూ క్రీడాకారిణి లను అభినందించారు.

గ్రూప్ -3 పరీక్షలను సమన్వయంతో, సజావుగా నిర్వహించాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్.. హాజరైన అధికారులు

గ్రూప్ -3 పరీక్షలను సమన్వయంతో, సజావుగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ ఆఫీసర్స్, అబ్జర్వర్స్, ఐడెంటిఫికేషన్ ఆఫీసర్స్, ఫ్లయింగ్ స్క్వాడ్, రూట్ ఆఫీసర్స్‌కు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి సమస్యలకు తావివ్వకుండా సమన్వయంతో ఈ నెల 17,18 తేదీలలో నిర్వహించే గ్రూప్ -3 పరీక్షలను సజావుగా నిర్వహించాలని తెలిపారు. అభ్యర్థుల బయో మెట్రిక్ అటెండెన్స్ తీసుకోవాలని, విమర్శలకు తావివ్వకుండా అభ్యర్థులను పరీక్ష హాలులోకి తనిఖీ చేసి పంపించాలని తెలిపారు. అభ్యర్థుల అటెండెన్స్ ఆరోపణలకు తావివ్వకుండా చూడాలని తెలిపారు. అభ్యర్థుల బయో మెట్రిక్ అటెండెన్స్, ఆన్లైన్ అటెండెన్స్ లో వ్యత్యాసం రాకుండా నిర్వహించాలని తెలిపారు. అభ్యర్థుల వెంట సెల్ ఫోన్, ఎలక్ట్రానిక్ గాడ్జెస్ లను పరీక్ష కేంద్రాలకు తీసుకరాకూడదని తెలిపారు. ప్రతీ సెంటర్ ముందు సెంటర్ పేరు, సెంటర్ కోడ్, లు తెలిపేవిధంగా ఫ్లెక్సీ లను ఏర్పాటుచేయాలని తెలిపారు. ప్రతీ పరీక్షా కేంద్రంలో త్రాగునీరు, మెడికల్ కిట్ తో పాటు వైద్య సిబ్బందినీ ఏర్పాటు చేయాలని, పరీక్షల సమయంలో విద్యుత్ అంతరాయం కలుగకుండా ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిబంధన ప్రకారం పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. అభ్యర్థుల బయో మెట్రిక్ అటెండెన్స్ ఉదయం 9 గంటలకు, మధ్యాహ్నం జరిగే పరీక్షకు 2 గంటలకు తీసుకోనున్నట్టు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్, రీజనల్ కో ఆర్డినేటర్ విజయ్ కుమార్, ట్రైనర్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

రక్షించే పోలీసులే.. భక్షిస్తే ఎలా

- లంచం తీసుకుంటూ పట్టుబడుతున్న పలువురు పోలీసులు
- వారం వ్యవధిలోనే రెండు ఘటనలు
- పోలీసు వృత్తికి కళంకం తీసుకొస్తున్న వైనం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



పోలీసులు అంటేనే రక్షణకు మారుపేరు. ప్రజలకు ఎటువంటి సమస్యలు వచ్చినా రక్షిస్తూ ప్రజలను కాపాడా ల్సిన బాధ్యతలో ముందుండే వారు. కానీ వారే లంచాలకు మరగడం గమనార్హం. ఇటీవల కాలంలో పలువురు ఎస్ఐలు లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడటం కలకలం రేపింది. ఈనెల 8న వర్ని ఎస్ఐ ఏసీబీకి చిక్కారు. తాజాగా గురువారం లింగంపేట్ మండలానికి చెందిన ఎస్ఐ ఎసిబికి పట్టుబడ్డారు.

పోలీస్ శాఖ అంటేనే అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతోందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. శాంతిభద్రతల పర్యవేక్షణ తొలి ప్రాధాన్యంగా విధులు నిర్వర్తించాల్సిన పలువురు పోలీసులు.. లంచాలకు మరిగి.. తిమ్మినిబమ్మి చేస్తూ నిందితుల పక్షాల నిలుస్తున్నారనే ఆరోపణలు నిత్యకృత్యమైయ్యాయి. బాధితుల వైపు నిలవాల్సి ఉండగా.. డబ్బు, పలుకుబడి, రాజకీయ అండదండలు ఉన్న వారి సేవల్లో తరిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.

స్టేషన్ బెయిల్ కోసం లంచాలు

ఈ నెల 8వ తేదీన నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని వర్ని ఎస్ఐ కృష్ణకుమార్ రూ.20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. కాగా తాజాగా గురువారం లింగంపేట్ ఎస్ఐ, కానిస్టేబుల్ సైతం రూ.10 వేల లంచం తీసుకుంటూ పట్టుబడటం గమనార్హం. రెండు కేసుల్లో సైతం స్టేషన్ బెయిల్ కోసం బాధితుల నుంచి లంచాలు తీసుకోవడం గమనార్హం. కాగా వీరు ఏసీబీ అధికారులను సంప్రదించడంతో వెలుగుజూసింది. కానీ బయటకు చెప్పుకోని వారు ఎందరో అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి.. ఇలాంటి వాటి పట్ల దూరంగా ఉండాలని సిబ్బందికి సూచించాలని ప్రజలు కోరుతున్నారు.

సాలూర ఏఓగా బాధ్యతలు చేపట్టిన శ్వేత

నవతెలంగాణ-బోధన్



సాలూర మండల వ్యవసాయశాఖ అధికారిగా కే.శ్వేత గురువారం బాధ్యతలు చేపట్టారు. సాలూర రైతు వేదికలో ఆమె ఆసీనులయ్యారు. సాలూర మండలంలోని ఆయా గ్రామాల రైతులకు తాను అందుబాటులో ఉండి సేవలందిస్తానని ఆమె తెలిపారు. ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు రైతులకు సక్రమంగా అందేలా కృషి చేస్తానని నూతన మండల వ్యవసాయ శాఖ అధికారి శ్వేత పేర్కొన్నారు. గతంలో నిజామాబాద్ రూరల్‌లో ఏఈఓ గా పనిచేసిన శ్వేత తర్వాత జరిగిన ఏఓ ఉద్యోగాల నియామకంలో భాగంగా అర్హత సాధించి ఏఓ ఉద్యోగాన్ని సాధించారు.ఆమె తొలిసారిగా మండల వ్యవసాయ శాఖ అధికారిగా సాలూర మండలానికి నియామకం అయ్యారు.

బాలోత్సవాలలో విజేతలుగా విజయ్ విద్యార్థులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జనవిజ్ఞాన వేదిక, మల్లు స్వరాజ్యం ట్రస్టు, టీపీఆర్పీఏ ఆధ్వర్యంలో గత రెండు రోజులపాటు బాలోత్సవాలు ప్రెసిడెన్సి పాఠశాలలో నిర్వహించారు. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలలో విజయ్ హైస్కూల్లో 6వ తరగతి సాహితి (ప్రథమ), 7వ తరగతి వంశీకృష్ణ క్విజ్ జూనియర్ విభాగంలో (ప్రథమ), సీనియర్ విభాగంలో శ్రీ చంద్ర (10వ తరగతి), అసీనీ ఫాతిమా (ద్వితీయ), వ్యాసరచనలో 9వతరగతి ఆర్.శ్లోకకు (ప్రథమ), కూచిపూడి నృత్యంలో 8వ తరగతి వైభవికి (ప్రథమ), హ్యాండ్రైటింగ్ (చేతిరాత)లో 10వ తరగతి యునీస్ సోషన్యు (ప్రథమ), పద్యాలాపనలో 6వ తరగతి చదివే నిష్ణశ్రీకి (తృతీయ), పాటల పోటీలో 9వ తరగతి చదివే డి.మనస్వినికి (తృతీయ) లభించాయి. ఈ సందర్భంగా వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులను విజయ్ హైస్కూల్ వ్యవస్థాపకులు డా.అమృతలత అభినందించారు.



బోధన్: టీచర్‌గా మారిన విద్యార్థిని



ఎడపల్లిలో...



ఏర్గట్లలో...



నిజామాబాద్ సిటీలో...

పిల్లలు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి

- ఘనంగా బాలల దినోత్సవం
- పలు కార్యక్రమాలతో అలరించిన చిన్నారులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

కంఠేశ్వర్ : సారంగపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. బాలబాలికలు సాంస్కృతిక కార్యక్రమాలతో హోరెత్తించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రొటేరియన్ జి రామకృష్ణ మాట్లాడుతూ.. పిల్లలు నిర్భయంగా ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని తెలిపారు. పాఠశాల ఇంచార్జ్ హెడ్మాస్టర్ రాధాకృష్ణ మాట్లాడుతూ.. రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలు సమాజానికి ఆశావాహంగా ఉంటాయని పిల్లలు సేవా గుణాన్ని అలవర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో తులసీదాస్పటల్, బాబురావు, ఉపాధ్యాయులు గోపాల్, జావిద్, విద్యాసాగర్, గంగాధర్, ఘనపురం దేవేందర్, అనిత, శ్రీ లత, స్వరూప లలిత, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్ : మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లోని పలు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని 'బాలల దినోత్సవ' వేడుకలను పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ముప్కాల్, రెంజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు వెంచిర్యాల, నల్లూర్, నాగంపేట్, వేంపల్లి, కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలాల్లో 'బాలల దినోత్సవాల' ను నిర్వహించారు. అదేవిధంగా స్థానిక కేజీబీవీ పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణవేణి ఉన్నత పాఠశాల విద్యార్థులకు సన్మానం..

మండల కేంద్రంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో 'బాలల దినోత్సవం' సందర్భంగా ముగ్గురు పాఠశాల విద్యార్థులను పోలీ సు శాఖ, లయన్స్ క్లబ్ సభ్యులు సంయుక్తంగా కలిసి ఘనంగా సన్మానించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

ఉత్తమ విద్యతో పాటు క్రీడాల్లో రాణిస్తున్న అనన్య యాదవ్, అక్షయ్, హీనలను 'బాలల దినోత్సవం' పురస్కరించుకుని ప్రత్యేకంగా గుర్తించి సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ చవాన్ రాజేందర్, ఏఎస్సై తొగర్ల సురేష్, ముప్కాల్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు కొమ్ముల నర్సయ్య, విద్యాసాగర్, ముస్కు రాజేశ్వర్, చాకు లింగం, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో కౌన్సిల్ ఎన్నికలు

నవీపేట్ : మండల కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కౌన్సిల్ ఎన్నికలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్ బాయ్, హెడ్ గర్ల్‌లను బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు వేసి ఎన్నుకున్నారు. విద్యార్థులకు ఎన్నిలకలలో నోటిఫికేషన్, నామినేషన్స్, స్క్రూటీని, మేనిఫెస్టో, ప్రచారం లాంటి విధానాలపై అవగాహన కలగడంతో పాటు నాయకత్వ లక్షణాలు అలవడతాయని ప్రిన్సిపల్ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయరెడ్డి, రాజు, శరత్, అంజనేయులు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్ : మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జేసీ)లో విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి బోధించారు.



నిజామాబాద్‌సిటీ : హోవర్డ్ స్కూల్లో

అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి హెచ్ఎం బాలచంద్రం, ఉపాధ్యాయులు బహుమతులు అందించారు.

ఇందూర్ పాఠశాలలో..

పట్టణంలోని ఇందూర్ ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులు పలువురు నాయకుల, వైద్యుల వేషధారణ ధరించి అలరించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భీంగల్ రూరల్ : భారత దేశ మొట్ట మొదటి ప్రధాన మంత్రి స్వర్గీయ జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని భీంగల్ పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవాన్ని జరుపుకున్నారు. పాఠశాల కరెస్పాండెంట్ డాక్టర్ షఫీ నెహ్రూ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. కార్యక్రమంలో పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ సన, ప్రిన్సిపాల్ రాధా కృష్ణన్ నాయర్, ప్రైమరీ ఇంచార్జి బిను, పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రకాష్, ఉపాధ్యాయులు అశోక్, శ్రీనివాస్, నరేందర్, ఖలీం, శివపాల్, విజయ్ కుమార్, కిషన్, భాను ప్రకాష్, నవిత, దీనా, సాత్విక, పిఈటి ప్రశాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

నిజామాబాద్ సిటీ : విద్యార్థులు విద్యను అభ్యసించాలని ,విద్య వికాసానికి తోడ్పాటుతుందని బాలల న్యాయ మండలి చైర్ పర్సన్,ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కుష్బు ఉపాధ్యాయ్ అన్నారు. నిజామాబాద్ నగరంలోని నాగారంలో గల బాలుర పరిశీలక గృహంలో గురువారం నిర్వహించిన బాలల దినోత్సవంలో ఆమె పాల్గొని బాలలతో కలిసి ఆటలు ఆడిన అనంతరం మాట్లాడారు. తెలిసిచేసిన, తెలియక చేసిన నేరం నేరమేనని అది బాలలతో సహా అందరికి వర్తిస్తుందని ఆమె తెలిపారు. పద్దెనిమిదేళ్ల వయసులోపు నేరాలు చేసిన బాలలను ప్రభుత్వ బాలుర పరిశీలక గృహాలలో తాత్కాలికంగా ఉంచడం జరుగుతుందని అన్నారు. పరిశీలక గృహాలు బాలల్లో మంచి మార్పుకోసమేనని, ఉత్తమ బాలలుగా తీర్చిదిద్దుకోవడానికి ఉపయోగ పడతాయని పేర్కొన్నారు. న్యాయవ్యవస్థ బాలల సంక్షేమానికి, ప్రగతికి తోడ్పాటు అందిస్తుందని జడ్జి కుష్బు తెలిపారు. బాలల చట్టాల్ల ప్రగతిశీలక మార్పులు తెచ్చారని, అవి బాలల పురోభివృద్ధికి బాటలు వేస్తాయని ఆమె అన్నారు. అనంతరం బాలలకు బహుమతులు అందజేశారు.

బాల్కొండ : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో గురువారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు, విద్యార్థులు తయారు చేసిన ఆహారంతో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో బాలల దినోత్సవం

నిజామాబాద్ సిటీ : నిజామాబాదులోని వినాయక్ నగర్ లో గల శ్రీ చైతన్య టెక్నో స్కూల్ (బ్రాంచ్ 2) లో బాలల దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీ చైతన్య డైరెక్టర్ శ్రీ విద్యా, చైర్మన్ శ్రీధర్, జీఎం నాగేంద్ర బాలల దినోత్సవం గురించి పిల్లలకు చక్కని సందేశాన్ని అందజేశారు. కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలను బాలబాలికలు చక్కగా ప్రదర్శించారు.కార్యక్రమంలో ఏజీఎం సతీష్ రెడ్డి, కోఆర్డినేటర్ నరేంద్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ కృష్ణ , ఇన్చార్జులు, ఉపాధ్యాయులు వారి వారి సందేశాలను అందించారు.

బాల్కొండ : మండల కేంద్రంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో గురువారం స్థానిక పాండురంగ ఫంక్షన్ హాల్ లో జరిగిన బాలల దినోత్సవ వేడుకల్లో విద్యార్థినీ విద్యార్థులు రకరకాల వేషాధారణలో అలరించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు డ్రామా, పలు రకాల పాటల రూపంలో నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు కోటగిరి భానుచందర్, ఆకుల లక్ష్మణ్ ,పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్ కార్తన్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కంఠేశ్వర్ : నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రెడ్ క్రాస్ సొసైటీలో బాలల దినోత్సవం సందర్భంగా తలసేమియా వార్డులో తలసేమియా వ్యాధి తో బాధపడుతున్న పిల్లలకు పం డ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిజి. ఎన్ పిడిసిఎల్ నిజామాబాద్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రాపెల్లి రవీందర్ పిల్లలకు పండ్ల కిట్స్ అందచేసి అన్నదానం చేశారు. ఇందుకు సహకరించిన పండ్ల కిట్స్ దాత రెడ్ క్రాస్ కోశాధికారి కరిపే రవీందర్, అన్నదాన దాత రెడ్ క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్ ని అభినందించారు. కార్యక్ర మంలో రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ బుస్స ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ స భ్యుడు తోట రాజశేఖర్ , కోశాధికారి కరిపే రవీందర్ ,మెడికల్ ఆఫీసర్‌డా.రాజేష్, పిఆర్ఓ బి.రామకృష్ణ,సిబ్బంది పాల్గొన్నారు.

పోతంగల్ : బాలల దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలో విద్యార్థులు, సంస్కృతిక కార్యక్రమాలలో ఉపన్యాసాలు, పాటలు, డాన్సులతో పాటు, నాటిక ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. ఎంఇఓ శంకర్ విద్యార్థుల ప్రదర్శనను మెచ్చుకున్నారు. ప్రధానోపాధ్యాయులు డి. సాయిలు మాట్లాడుతూ విద్యార్థులు పలు కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. నిర్వహణకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

ఎడపల్లి : ఏఆర్‌పి క్యాంప్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయులు రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కథలు, జ్ఞాపకశక్తి పోటీలను నిర్వహించారు .పాఠశాల బాలికలు తోటి బాల బాలికలకు పాఠ్యాంశాలు చెబుతూ చదువు ప్రాముఖ్యతపై వివరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రమేష్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవంబర్ 14న జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకల సందర్భంగా బాలబాలికలకు పోటీలు ఏర్పాటు చేసి గెలుపొందిన బాల బాలికలకు బహుమతులను అందజేస్తారని తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏర్గట్ల : మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కృష్ణాచారి మాట్లాడుతూ...జీవితంలో క్రమశిక్షణగా ఉంటూ.. కష్టపడ్డవారే గొప్పవ్యక్తులుగా ఎదుగుతారని అన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోధన్ : భారత మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతిని గురువారం బోధన్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రజా ప్రతినిదులు, రాజకీయ నాయకులు పోస్టాఫీసు వద్ద గల నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. దేశ మొదటి ప్రధానిగా బాధ్యతలు నిర్వహించిన నెహ్రూ దేశాన్ని అభివృద్ధి బాటలో పయనించడానికి వీలుగా చేపట్టిన సంస్కరణలు నేటికీ కొనసాగుతున్నాయని పలువురు అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పాషా మొయినుద్దీన్, కౌన్సిలర్లు తూము శరత్ రెడ్డి, మీర్ నజీర్ అలీ, జావిద్, శ్రీకాంత్ గౌడ్, అబ్దుల్లా, మారుతి మందిరం చైర్మన్ శంకర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తలారి నవీన్, నాయకులు బొగ్గుల ప్రభాకర్, బ్యాటరీ బాబా, అహ్మద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్నేహ సొసైటీలో ఘనంగా బాలల దినోత్సవం

నవతెలంగాణ-కంఠేశ్వర్



స్నేహ సొసైటీ ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలు

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మారుతి నగర్ లో గల స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాలలో బాలల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల పాల్గొని పండిట్ జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగ బాలలు సకలాంగ బాలల కంటే మంచి ప్రతిభను చూపి ఎందులోనూ తక్కువ కారని నిరూపించారన్నారు. చాలామంది విద్యార్థులు బాలల దినోత్సవం సందర్భంగా మంచి మంచి వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నారు. 100 మంది విద్యార్థులు పాటలు పాడి మంచి నైపుణ్యాన్ని ప్రదర్శించగా మానసిక దివ్యాంగులు మంచి నృత్యాలతో ప్రతి ఒక్కరిని ఆకట్టుకున్నారన్నారు. అంధ బాలికలను ఎత్తుకొని దివ్యాంగ బాలలతో పాటు నృత్యాలలో పాల్గొని వారిని ప్రోత్సహించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జ్ పద్మావతి బాలలకు తమ సందేశాన్ని అందించారు. జిల్లా సంక్షేమ అధికా రి రసూల్ బి విద్యార్థులకు పలు సూచనలను తెలియజేశారు. అనంతరం బాలలకు బహుమతులను, మిఠాయిలను అందజేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్నేహ సొసైటీలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించా రు. దివ్యాంగ బాలలు వివిధ దేశ నాయకుల వేషధారణలో ప్రతి ఒక్కరిని అలరించారు. కార్యక్రమంలో స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి, వైస్ ప్రిన్సిపల్ రాజేశ్వరి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు దామోదర్ రావు, కార్యదర్శి శ్రీశైలం, కోశాధికారి డాక్టర్ రాజేంద్రప్రసాద్, నూతన అధ్యక్షులు అజ్జ శ్రీనివాస్, నూతన కార్యదర్శి డాక్టర్ బాలేష్, నూతన కోశాధికారి శ్రీకాంత్, వాయిస్ ప్రెసిడెంట్ డాక్టర్ అర్చన, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం 18 మంది పేద పిల్లలకు స్నేహ సొసైటీ దుప్పట్లు, బెడ్ షీట్లు పంపిణీ చేశారు.

మిసిని ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన

కమ్మర్‌పల్లి : మండల కేంద్రంలోని మిసిమి ఉన్నత పాఠశాలలో గురువారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు.పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి చిన్న తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రధానోపాధ్యాయులుగా మదీయ, తెలుగు గగన శ్రీ, హిందీ రఫీయ, ఇంగ్లీషు కీర్తన, గణితం మదీహ, ఫీజిక్స్ హరిణి, బయోసైన్స్ రక్షిత, సాంఘిక శాస్త్రం ప్రజ్వల్, పిఇటిగా రిషివర్ధన్ వ్యవహరించారు. ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు తమతోటి విద్యార్థులకు చక్కగా బోధించారు. ఉపాధ్యాయులుగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ బాలే రవీందర్ అభినందించారు.



ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు

కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ముప్కాల్: క్రీడల్లో రాణించిన అనన్యను సన్మానించిన పలువురు



నిజామాబాద్‌సిటీ : శ్రీచైతన్య టెక్నో స్కూల్లో ...



భీంగల్ రూరల్: వివిధ వేశదారణలో చిన్నారులు



పోతంగల్‌లో...

అడవి మామిడిపల్లి
రైల్వే బ్రిడ్జి పనుల సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు

- పోలీస్ శాఖ సూచించిన మార్గాల్లో ప్రయాణించాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈనెల 10వ తేదీ నుండి వచ్చే నెల 15వ తేదీ వరకు అడవి మామిడిపల్లి రైల్వే బ్రిడ్జి పనులు జరుగుతున్నందున వాహనదారులు, కొన్ని భారీ వాహనాలు, ఇతర వాహనాలు రైల్వే పని జరుగుచున్న బ్రిడ్జి వరకు తెలియకుండా చేరుకొని ఇబ్బంది పడుచున్నారని నిజామాబాద్ ట్రాఫిక్ సహాయ కమిషనర్ నారాయణ బుధవారం తెలిపారు. పోలీస్ శాఖ సూచించిన, తెలిపిన మార్గాల ద్వారా తమ ప్రయాణాలు సాగించాలని కోరారు. నిజామాబాద్‌నుండి ఆర్మూర్ వెళ్లే భారీ వాహనాలు డిచ్‌పల్లి హైవేపైనుండి ఆర్మూర్ చేరుకోవాలన్నారు. ఆర్మూర్ నుండి నిజామాబాద్ వచ్చే భారీ వాహనాలు డిచ్‌పల్లి హైవే పైనుండి నిజామాబాద్ నగరానికి చేరుకోవాలని తెలిపారు. ఆర్టీసీ బస్సులు మాత్రం ఆర్మూర్ వెళ్లడానికి చిన్నాపూర్, కల్లెడి, ఆలూర్ గ్రామాల మీదుగా ఆర్మూర్ చేరుకోవాలని చెప్పారు. ఆర్మూర్ నుండి నిజామాబాద్ వచ్చే ఆర్టిసి బస్సులు యదావిదిగా నిజామాబాద్ నగరానికి చేరుకోవాలని తెలిపారు. కావున వాహనదారులు విషయాన్ని గమనించి ప్రయాణాలను పోలీస్‌లు సూచించిన మార్గాలలో వాహనాల రాకపోకలు కొనసాగించాలని కోరారు.

బాలికలకు రక్తహీనతపై అవగాహన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తిర్మన్ పల్లి గ్రామంలోని తెలంగాణ గిరిజన బాలికల పాఠశాల, కళాశాలలో కౌమార దశ బాలికలకు రక్తహీనతపై అవగాహన కార్యక్రమం మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ అద్వర్యంలో గురువారం నిర్వహించారు. "ఎనీమియా ముక్త్ భారత్" అనే కార్యక్రమం లో బాగంగా 220 మంది పిల్లలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. కౌమారదశ బాలికలకు రక్తంలో హిమోగ్లోబిన్ 12 గ్రాములు ఉండా లని, అంతకన్నా తక్కువగా ఉన్నట్లయితే ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలు వారానికి ఒకసారి ఇవ్వాలని తెలిపారు. అలాగే 11 గ్రాములు హిమోగ్లోబిన్ ఉన్న పిల్లలకు ప్రతిరోజు ఒక ఐరన్ పోలిక ఆసిడ్ మాత్రమే ఇవ్వాలని అన్నారు.

10 గ్రాములు హిమోగ్లోబిన్ గల పిల్లలకు ప్రతిరోజు రెండు ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు ఇవ్వాల్సి ఉంటుందని వివరించారు. రక్తహీనత గల 8 గ్రాముల కంటే తక్కువ హిమోగ్లోబిన్ గల పిల్లలకు మూడు నెలలు ప్రతిరోజు రెండు ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలు ఇవ్వాలని తెలిపారు. కౌమార దశ బాలికలు తీసుకునే ఆహారంలో పూర్తిస్థాయిలో తాజాఆకుకూరలు, బీట్రూట్, పాలు, బెల్లం, పల్లీలు అధికంగా తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఆహారం తీసుకునే ముందు మరుగుదొడ్డి వాడిన తర్వాత చేతులు శుభ్రంగా కడుకోవాలని, చేతులు కడిగే విధానాన్ని వివరించారు. చేతులను శుభ్రంగా కడుక్కోనట్లైయితే నులిపురుగులు కడుపులోకి వెళ్లి రక్తహీనత కలిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పోషకాహార లోపం ఏర్పడి రక్తహీనతకు గురి అవుతారని తెలిపారు. పిల్లలకు మొదట అల్బెండజోల్ మాత్రలు వేసి ఆ తర్వాత ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలు వేయాలని స్థానిక స్టాఫ్ నర్స్ కు వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు అక్బర్ అలీ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ ఆరోగ్య సిబ్బంది శారద ,ఆర్. బి.ఎస్.కే సిబ్బంది, ఫార్మసిస్ట్ మౌనిక,సుమలత, స్టాఫ్ నర్స్ స్రవంతి ఆశా కార్యకర్త బండ ప్రమీల పాల్గొన్నారు.

వసతి గృహాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలి

- బోధన్ సబ్ కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-ఎడపల్లి

రాష్ట్రప్రభుత్వం త్వరగా హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ తొందరగా పూర్తి చేస్తూ విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ గురువారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహితోకు తెలంగాణ స్టూడెంట్ పరిషత్ (టి ఎస్ పి) ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని సమర్పించారు. ఈసందర్భంగా నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు మావురం శ్రీకాంత్ మాట్లాడుతూ.. వసతి గృహాల్లోని విద్యార్థుల సంఖ్యకు సరిపడా స్నానపు గదులు మరుగుదొడ్లు లేనందున రాత్రివేళలా తగినంత నిద్ర ఉండడం లేదని కాలకృత్యాలు తీర్చుకోవడానికి మూడు నాలుగు గంటల రాత్రి సమయంలో నిద్రలేవాల్సి వస్తుందన్నారు. ఇన్‌ఛార్జి వార్డెన్ ఉండటం వల్ల విద్యార్థులు చదువుకు ఇబ్బందిగా మారుతుందని, అందువల్ల ఇన్చార్జ్ వ్యవస్థను కాకుండా హాస్టల్ కి ఒకే వార్డెన్ ఉండేట్టుగా వార్డెలను తొందరగా విధుల్లోకి తీసుకోవాలని విన్నవించారు.

బీర్కూర్ మార్కెట్ చైర్మన్‌గా దుర్గం శ్యామల

నవతెలంగాణ-నసురుల్లాబాద్

కామారెడ్డి జిల్లా బీర్కూర్ మార్కెట్ యార్డ్‌కు పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బీర్కూర్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌గా నసురుల్లాబాద్ మండలం దుర్కి గ్రామానికి చెందిన మాజీ ఎంపిపి, తాజా మాజీ సర్పంచ్ దుర్గం పల్లి శ్యామలను నియమించారు. బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన యమ రాములు వైస్ చైర్మన్ పదవి దక్కింది. వాస్తవానికి ఉమ్మడి బీర్కూర్ మార్కెట్ యార్డ్ రొటేషన్ పద్ధతిలో ఒక టర్మ్ నసురుల్లాబాద్‌కు మరొక టర్మ్ బీర్కూర్‌కు చైర్మన్ పదవి కేటాయించవలసి ఉంటుంది. సభ్యులుగా గొర్రె పాటి రాంబాబు, బి.సాయిలు. నేనావత్ సాగ్య నాయక్, షేక్ ఇక్బాల్, గోల్లల పెద్దరాజు, పాస్పులా సెయిలు, పెద్ది మారుతీరెడ్డి, బోరంచ హన్మంత్ రెడ్డి, ధరావత్ అంబర్ సింగ్, మాడ కాశీరాం, ముత్యాల శ్రీధర్, కొట్టూరి హన్మండ్లు, పాలకవర్గాన్ని నియమిస్తూ మార్కెటింగ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో ప్రమాణోత్సవ కార్యక్రమం నిర్వహించడానికి ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.

వరి కొనుగోలుకు కేంద్రం పరిశీలన

నవతెలంగాణ-సదాశివనగర్



కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం లోని అడ్లూరు ఎల్లారెడ్డిలోని వరి కొనుగోలు కేంద్రాన్ని గురువారం జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్లలో మట్టి పెల్లలు చెత్తాచెదారం లేకుండా కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని రైతులకు సూచించారు. వరి కొనుగోలు కేంద్రంలో వడ్లు కాంట అయిన తర్వాత మూడు నాలుగు రోజుల్లో డబ్బులు రైతు ఖాతాలో అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ సదాశివరెడ్డి, మండల వ్యవసాయ అధికారి ప్రజాపతి, ఏఈఓ కళ్యాణి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే

నవతెలంగాణ-విలేకరులబృందం

భారత మాజీ ప్రధాని జవహర్లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా బాలల దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. స్కూళ్లలో విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నాయకులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలు స్కూళ్లలో స్వయపాలన దినోత్సవం నిర్వహించారు.

నిజాంసాగర్ : మండలం లోని నర్సింగ్ రావు పల్లి ప్రాథ మిక పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. అనంతరం పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమం లో పాఠశాల హెచ్ఎం దేవిసింగ్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పిట్లం : పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి వేడుకలను మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని నెహ్రూ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దేశ మొదటి ప్రధానిగా దేశ మనుగడకు ఎనలేని కృషి చేస్తూ సంపన్న దేశాలతో పోటీపడేలా ఎన్నో సంస్కరణలను అమలుపర చిన ఘనత ఆయనకే దక్కిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు సాయ గౌడ్ , శేఖర్ గౌడ్ , నర్సాగౌడ్, లవ సంగా గౌడ్ , బాబా గౌడ్ , లక్ష్మి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పిట్లం : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో గల 7వ అంగన్‌వాడీ సెంటర్‌లో బాలల దినోత్సవం అంగన్వాడీ టీచర్ ప్రవీణ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.

గాంధారి : మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జవహర్ లాల్ నేహ్రు జన్మదినం సందర్భంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్, మాజీ ఎంపీటీసీలు తూర్పు రాజు, కామెల్లి బాలరాజు, లైన్ రమేష్, ఆకుల లక్ష్మణ్, బాలరాజుగారి క్రిష్ణ, నీల రవి, తదితరులు పాల్గొన్నారు

తాడ్వాయి : తాడ్వాయి మండలంలోని కృష్ణజవాడి జడ్పీహెచ్ఎస్‌లో స్వయంపాలన నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు రామస్వామి తెలిపారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు బోధించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు గిర్మబోయి సుజాత, శ్రీహరి, గంగాధర్, శారద తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్ : మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ పాఠశాలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన జుక్కల్ ఎమ్మెల్యే నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నేటి బాల, బాలికలే రేపటి దేశ భవిష్యత్తుకు పునాదులని తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థిని క్రమబద్ధంలో పెట్టి ఉన్నత స్థాయిలకు చేర్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ప్రవీణ్ కుమార్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు కమల, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్ : మండలంలోని అంగన్వాడీ కేంద్రాలలో చిల్డ్రన్స్ డే కార్యక్రమాలు ఘనంగా నిర్వహించినట్లు మండల అంగన్వాడీ టీచర్ల సంఘం తెలియజేసింది. మండలంలోని కేమ్రాజ్‌కల్లాలి, తాండాలలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో టీచర్ రాధ ఆధ్వర్యంలో చిల్డ్రన్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి అనంతరం ఆటల పోటీలు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



ఎల్లారెడ్డి: సబ్దల్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు

కామారెడ్డి : కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్కిడ్స్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వయం పరిపాలన దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, బాధ్యత భావనను పెంపొందించడం లక్ష్యంగా కలిగి ఉంటుందని పాఠశాల ప్రిన్సిపల్, చైర్మన్ గోవర్ధన్ రెడ్డి తెలిపారు. అనంతరం ఆర్కే గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్ సీఈవో జైపాల్ రెడ్డి, విద్యార్థుల కృషిని ప్రశంసిస్తూ, బాలల దినోత్సవం ప్రతి విద్యార్థిలోని మెరుగైన ప్రతిభను గుర్తుచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ భూలక్ష్మి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : మండలంలోని మల్లయ్యపల్లి, సబ్దల్ పూర్ ప్రాథమిక పాఠశాలలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా ఆధ్వర్యంలో జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు చాక్లెట్లు పంపిణీ చేశారు. సందర్భంగా కురుమ సాయిబాబా మాట్లాడుతూ... భారతదేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చేసిన సేవలను గుర్తు చేశారు. వివిధ జాతీయ నాయకుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కురుమ సాయిబాబా, కాంగ్రెస్ పార్టీ యూత్ మండల అధ్యక్షులు సంతోష్ నాయక్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు నాగం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అదే విధంగా ఎల్లారెడ్డిలోని 11వ వార్డు లింగారెడ్డిపేట్ ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవం నిర్వమించారు.

మార్కెట్ యార్డులో వడ్లు పరిశీలించిన ఏవో



ధాన్యంను పరిశీలిస్తున్న ఏవో

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో గురువారం ఏవో సాయికిరణ్ సన్న రకం వడ్లను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యం విక్రయించాలని రైతులకు సూచించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ డైరెక్టర్ నగేష్ ఉన్నారు.

పెట్రోల్ బంక్‌తో ఉపాధి



సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన భారత్ పెట్రోల్ బంకును మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పురం రాజమౌళి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్రోల్ బంక్ ఏర్పాటు వల్ల పదిమందికి ఉపాధి లభిస్తుందని పెట్రోల్ బంకు ఏర్పాటుచేసిన యజమానిని ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం పెట్రోల్ బంక్ యజమాని మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పురం రాజమౌళిని శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెట్రోల్ బంక్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు పెట్ సంగం క్రీడాకారులు

నవతెలంగాణ-గాంధారి



ఎన్నికైన విద్యార్థులు

తెలంగాణ ఎస్ జీ ఎఫ్ అండర్ 14 వాలీబాల్ పోటీలకు గాంధారి మండలంలోని పెట్ సంగెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు బస్సీ అర్జున్, బుక్యా అర్జున్, మధుప్రియ, దీపిక ఎంపిక అయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుమారా స్వామి గురువారం తెలిపారు. ఈ నెల 11న ఇక్కడ జరిగిన ఉమ్మడి జిల్లా పోటీల్లో వీరు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్టు తెలిపారు. ఈ నెల 16 నుండి 18 వరకు మెదక్ జిల్లా చెగుంటలో జరిగే రాష్ట్ర స్థాయి 68వ పోటీలో వీరు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణ్ రాథోడ్ తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో సైతం ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు.

సహ చట్టంపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని జంగంపల్లి గ్రామ సమీపంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, పట్టణ కేంద్రంలో ఉన్న జూనియర్ కళాశాలలో సమాచార హక్కు చట్టం 2005 పైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సహ చట్టం పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ సలీం మాట్లాడుతూ సహ చట్టం ద్వారా ఎలాంటి ఉపయోగాలు ఉన్నాయో విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హారిక, న్యాయవాదులు శ్రీనివాసరావు, డి సతీష్ కుమార్, సహ చట్ట పరిరక్షణ కమిటీ మండల మహిళ కార్యదర్శి ఎస్ నవనీత, పాఠశాల, కళాశాల సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.

రోగులకు అల్పాహారం అందజేత

నవతెలంగాణ-మద్నూర్

కాంగ్రెస్ పార్టీ నాయకులు సాయి పటేల్ జన్మదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్న రోగులకు అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో యువ నాయకులు బాలు యాదవ్, బాలు షిండే, బండివార్ హనుమాన్లు, తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం



పశువుకు వైద్యం చేస్తున్న పశువైద్యులు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని జల్లిపల్లి గ్రామంలో పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం గురువారం నిర్వహించారు. మండల పశు వైద్యాధికారిణి డాక్టర్ హనా జోనస్, డాక్టర్ రవి కుమార్‌లు పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కృష్ణ, ఎజాజ్ రమేష్, మల్లేష్, వెంకట్, శివలాల్, పరంధాములు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు పట్టణ కేంద్రంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణ కేంద్రానికి చెందిన నీల ఇస్తారి (56) అక్కడికక్కడే మరణించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నీలా ఇస్తారి సైకిల్ పై గాంధీ విగ్రహం వైపు వెళ్తుండగా వెనుక నుండి వస్తున్న ఇసుక ట్రాక్టర్ ఢీకొనడంతో అక్కడికక్కడ మరణించారు. స్థానికులు ట్రాక్టర్ డ్రైవర్ ను పట్టుకొని చితకబాదారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ట్రాక్టర్ డ్రైవర్ ను అదుపులోకి తీసుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా హాస్పిటల్ తరలించారు.

గురుకుల పాఠశాలలో వైద్య పరీక్షలు



విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని సిద్ధ రామేశ్వర నగర్ గ్రామ సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మెడికల్ అధికారి దివ్య విద్యార్థులకు వైద్య పరీక్షలు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటించాలని, భోజన సమయంలో చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. అనంతరం మత్తు పదార్థాల బారిన పడకుండా విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని, ధూమపానం, ఇతర మారక ద్రవ్యాలకు, చెడు వ్యసనాల బారిన పడకుండా విద్యార్థులు విద్యార్థి దశలో కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఈ ఓ వెంకటరమణ, ఎం పి హెచ్ ఎస్ రాజమణి, వైద్య సిబ్బంది సతీష్, హెచ్ ఏ యాదమ్మ ప్రవీణ్, ఆశా వర్కర్లు నీలిమ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

విద్యార్థినులకు కంటిపరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండలంలోని ముత్యం పేట్ గ్రామం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినిలకు కంటి వైద్యులు రవీందర్ ఆధ్వర్యంలో విద్యార్థి నిలకు కంటి పరీక్షలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందత్వ నివారణ కోసం ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినిలకు ఉచితంగా కంటి పరీక్షలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు , ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

- **జిల్లా పరిషత్**

మాజీ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ప్రతి ఒక్కరు సహకరించాలని జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని పోసానిపేటలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గిరెడ్డి మహేందర్‌రెడ్డితో కలిసి సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో ఉపాధి హామీ సిబ్బంది..



రామారెడ్డి: సర్వే చేస్తున్న అధికారులు

రామారెడ్డి : మండలంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నమోదులో ఉపాధి హామీ సిబ్బంది పాల్గొని సర్వేను నిర్వహిస్తున్నారు. సర్వేలో రెడ్డిపేట ఫీల్డ్ అసిస్టెంట్ బలరాం, రామారెడ్డి ఫీల్డ్ అసిస్టెంట్ రజిత, తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్ : మండలంలోని పలు గ్రామాలలో కుల గణన పకడ్బందీగా కొనసాగుతుందని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. గురువారం మండలంలోని గుండూరు గ్రామాన్ని సందర్శించి, సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో శుభోదయం ఎంపీడీవో, గ్రామ ప్రత్యేక అధికారులు, గ్రామ పెద్దలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లయ్ హమాలీలకు పెండింగ్ ఏరియర్స్ చెల్లించాలి

- **యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.బాలరాజ్**

నవతెలంగాణ-కామారెడ్డి

సివిల్ సప్లై హమాలీలకు పెండింగ్ వేతనం చెల్లించాలని సివిల్ సప్లై హమాలి జిల్లా అధ్యక్షులు పి.బాలరాజ్ అన్నారు. గురువారం జిల్లా ఏఐటీయూసీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో సివిల్ సప్లై కార్మికులు ఆందోళన వల్ల 26 నుంచి 29 రూపాయలకు ఎగుమతి, దిగుమతి రేట్లు పెంచడం జరిగిందని తెలిపారు. వీటిని జనవరి నుంచి అమలు చేస్తామని ప్రభుత్వం తెలియజేసిందన్నారు. అదేవిధంగా పెండింగ్ వేతనం కూడా చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అట్లాగే జిల్లాలో నిరుపేదలకు రేషన్ బియ్యం అందిస్తున్న కార్మికులకు కనీస వసతులు కల్పించాలని, మహిళలకు పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. సొంత జిల్లాలో 7 గోధాంలకు ఇప్పటివరకు సొంత గోధాం లేక కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అవుతుందన్నారు. ఇప్పటికైనా సొంత గోదాములు నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎల్.దశరథ్, మైపాల్, సాయిలు, నాందేవ్, రాములు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు బాలరాజ్

సీఎం జర్నలిస్టుల పట్ల మాట మార్చడం సరికాదు

- **టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు**

నవతెలంగాణ-కామారెడ్డి

ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన ప్రతి జర్నలిస్టులకి ఇళ్ల స్థలాలు ఇవ్వాలనీ టిడబ్ల్యూజేఎఫ్ కామారెడ్డి జిల్లా నాయకులు అన్నారు. సీఎం గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, ఇండ్లు నిర్మించి ఇస్తామని చేసిన వాగ్దానాన్ని వెంటనే నెరవేర్చాలనీ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాతీయ కౌన్సిల్ సభ్యుడు కృష్ణమాచారి మాట్లాడుతూ.. ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం కచ్చితంగా ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇచ్చి మాట నెరవేర్చుకోవాలని లేనిపక్షంలో టిడబ్ల్యూజెఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, ధర్నా కార్యక్రమాలు చేపడతామని సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మోహన్, కృష్ణమూర్తి, ప్రవీణ్‌గౌడ్, కరుణాకర్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా నాయకులు

దుకాణదారులు కిరాయిలు చెల్లించాలి

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు పట్టణ కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో బిఎస్ఎన్ఎల్ కార్యాలయ సమీపంలో నిర్మించిన 23 దుకాణాల సముదాయాల కిరాయిలు టెండర్లు దక్కించుకున్న వారు చెల్లించాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, డివిజనల్ పంచాయతీ అధికారి శ్రీనివాస్, ఎంపీడీవో, ప్రత్యేక అధికారి రాజ్ కిరణ్ రెడ్డి సూచించారు. గామపంచాయతీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టెండర్ లో దక్కించుకున్న వారు పూర్తి డబ్బులు చెల్లిస్తూ, మూడు విధాలుగా కిరాయి తీర్మానించడం జరిగిందని ఇట్టి కిరాయిలను ప్రస్తుతం దుకాణదారుల ఆధీనంలో గల దుకాణాలు ఆధీనంలోకి తీసుకున్న నాటినుండి నేటి వరకు కిరాయిలు చెల్లించాలని జిల్లా కలెక్టర్ ఆమోదానికి తీర్మానాలు పంపించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేష్ గౌడ్, వేలం పాటలో దక్కించుకున్న దుకాణదారులు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

కమ్యూనిటీ పోలీస్ ప్రోగ్రాం నిర్వహించిన డీఎస్పీ

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ నాగేశ్వరరావు

కామారెడ్డి ఎస్పీ ఆదేశాల మేరకు డిఎస్పి కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వరరావు, కామారెడ్డి రూరల్ సీఐ రామన్న ఆధ్వర్యంలో మాచారెడ్డి మండలంలోని ఎల్లంపేట గ్రామంలో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్లంపేట ప్రజలకు సైబర్ నేరాలపైన అవగాహన, 100 డయల్ ఉపయోగం, రోడ్డు భద్రతా నియమాలు, అటవీ సమస్యలు, డ్రగ్స్ తీసుకోవడం పైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంతో పాటు సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి సబ్ డివిజన్ ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారుల తల్లులకు అవగాహన

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని సాయి చందన పిల్లల హాస్పిటల్ వైద్యులు శివరాజ్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలు ఆసుపత్రిలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు శివరాజ్ చిన్నారులకు వ్యాక్సినేషన్, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలను వివరించారు. ముఖ్యంగా ఆర్ఎంపి, పిఎంపిల కంటే ప్రత్యేక నిపుణుల కల డాక్టర్లనే సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సాయి చందన హాస్పిటల్ వైద్యులు

నేడు డయల్ యువర్ ఆర్‌టిసి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిజామాబాద్ రీజియన్‌లో డయల్ యువర్ ఆర్‌టిసి కార్యక్రమం శుక్రవారం సాయంత్రం 04 నుండి 05 గంటల వరకు నిర్వహిస్తామని ఆర్టిసి రీజనల్ మేనేజర్ కె. జాని రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ప్రయాణికులు ఈ సదుపాయమును సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను నిజామాబాద్ రీజినల్ మేనేజర్ 9959226011, నిజామాబాద్ డివిజనల్ మేనేజర్ 9959226013, ఆర్మూర్ డిపో మేనేజర్ 9959226019, బోధన్ డిపో మేనేజర్ 9959226001, నిజామాబాద్ -1 డిపో మేనేజర్ 9959226016, నిజామాబాద్ -2 డిపో మేనేజర్ 9959226017, కామారెడ్డి డిపో మేనేజర్ 9959226018, బాన్సువాడ డిపో మేనేజర్ 9959226020 ఫోన్ నెంబర్‌లకు ఫోన్ చేసి తెలిపాలని పేర్కొన్నారు.

సహకార సంఘాలతో రైతులకు లబ్ది

నవతెలంగాణ-విలేకరులు

ఆర్మూర్-71 వ అఖిల భారత సహకార వారత్సవాల సందర్భంగా గురువారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పిప్రిలో అధ్యక్షులు సోమ హేమంత్ రెడ్డి ఏడు రంగుల సహకార పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గుండా లింగన్న, డైరెక్టర్లు ఇజాఫ్ మహేష్, రైతులు , సంఘ సభ్యులు , సీఈవో హన్మాండ్లు , సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

గోవింద్‌పేట్ సొసైటీలో జెండా ఆవిష్కరణ

ఆర్మూర్: మండలంలోని గోవింద్‌పేట్ గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో గురువారం సహకార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ బంటు మహిపాల్ జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు, సీఈవో రమేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వర్ని: జాకోరా గ్రామ ప్రాథమిక సహకార సంఘ ఆధ్వర్యంలో సొసైటీ చైర్మన్ దశరథ్ జెండాను ఆవిష్కరించారు. వారం రోజుల పాటు వారోత్సవాల్లో రైతులకు పలు విషయాల్లో అవగాహనా కల్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

మోపాల్: మండలంలోని బోర్గాం (పి) సొసైటీ పరిధిలో అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సంఘ అధ్యక్షులు, ఎన్‌డిసిసి బ్యాంకు వైస్ చైర్మన్ యస్.చంద్రశేఖర్ రెడ్డి సహకార జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలంగాణ సహకార యూనియన్ నుండి ప్రిన్సిపాల్ వెంకయ్య మానిటరింగ్ ఆఫీసర్ శ్రీనివాస్, సంఘ కార్యవర్గ సభ్యులు, ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, సంఘ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


ఆర్మూర్: పిప్రిలో జెండా ఆవిష్కరిస్తున్న సొసైటీ చైర్మన్


వర్నిలో..

మాక్లూర్: మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో అఖిల భారత సహకార దినోత్సవ జెండాను సొసైటీ చైర్మన్ బురోల్ల అశోక్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు గుండారం శేఖర్, డైరెక్టర్స్, సంఘ సెక్రెటరీ బి. ప్రవీణ్, హేడ్ క్లర్క్ విజయ్, సిబ్బంది శ్రీకాంత్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

ముప్కాల్: మండలంలోని వేంపల్లి, రెంజర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో 'సహకార జెండా'లను రైతుల మధ్య స్థానిక సొసైటీ చైర్మన్లు జక్క రాజేశ్వర్, కోమటిశెట్టి గంగాధర్ ఆవిష్క రించారు. కార్యక్రమంలో వేంపల్లి, రెంజర్ల వైస్ చైర్మన్లు, సంఘ పాలకవర్గ సభ్యులు, క్లస్టర్ రైతులు, సొసైటీ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు..

ఏర్గట్ల: ఏర్గట్ల, తాళ్ళ రాంపూర్ పీఏసీఎస్‌లలో సంఘ అధ్యక్షులు బర్మ చిన్న నర్సయ్య, పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన సహకార వారోత్సవాల సందర్భంగా పతాకాన్ని ఆవిష్కరించారు. ఏర్గట్ల పీఏసీఎస్ వైస్ చైర్మన్ సిగసారం గంగారాం, ఇరు సంఘాల డైరెక్టర్లు రైతులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలల దినోత్సవ వేడుకలు



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న హెడ్‌మిస్ట్రెస్ సయ్యదా జహ్రాఖాద్రి

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని సెయింట్ అలీయుద్దీన్ స్కూల్‌లో గురువారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని నిర్వహించే బాలల దినోత్సవ వేడుకల సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు క్రీడా పోటీలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల హెడ్ మిస్ట్రెస్ సయ్యదా జహ్రా ఖాద్రి బహుమతులను, ప్రశంసా పత్రాలను వారికి అందజేశారు. ఈ సందర్భంగా సయ్యదా జహ్రా ఖాద్రి మాట్లాడుతూ విద్యార్థులు భావి తరాలకు నిర్మాతలని, దేశ భవిష్యత్తు తరగతి గదులలోనే రూపు దిద్దుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ సయ్యదా హలీమా ఖాద్రి, కరస్పాండెంట్ సయ్యదా సల్మా ఖాద్రి, జాయింట్ సెక్రెటరీ సయ్యదా నువెరా ఖాద్రి, ట్రెజరర్ ఖదిజ ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

కందకుర్తి గోదావరి ప్రధాన ఘాట్‌కు అహల్య భాయ్ హెూల్కర్ నామకరణ


ప్రధాన ఘాట్‌వద్ద నామకరణం చేస్తున్న పలువురు

నవతెలంగాణ-రెంజల్

నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కందకుర్తి గోదావరి త్రివేణి సంగమం ప్రధాన ఘాటుకు అహల్య భాయ్ హుల్కర్ నామకరణ చేశారు. గతంలో అహల్యాబాయ్ హెూల్కర్ కందకుర్తి గోదావరిలో నున్న రాతి శివాలయాన్ని నిర్మించడానికి ప్రధాన కారకురాలని, కందకుర్తి గ్రామానికి అనేక సేవలు అందించిన ఘనత ఆమెకే దక్కుతుందని, అందుకే ఆమె పేరు మీదుగా ప్రధాన ఘాటుకు నామకరణం చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో పెద్దలు సురేష్ బాబు, అప్పల ప్రసాద్ జి, సృజన్ గజానన్, బాలరాజు, గంగ నరసయ్య, సురేష్, సతీష్, బి .రమేష్, నగేష్, జి. సతీష్, సాయికిరణ్, గంగరాజు, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కొలిప్యాక్ మాజీ ఎంపిటిసి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కొలిప్యాక మాజీ ఎంపీటీసీ మద్దుల రమేష్ గురువారం కలిశారు. మండలంలోని కొలిప్యాక్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ మద్దుల రమేష్ తన జన్మదిన వేడుకలు పురస్కరించుకొని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆశీర్వాదం తీసుకున్నారు.

గడువులోగా సర్వే పూర్తి చేయాలి

- తహసిల్దార్, ఎంపీడీవో

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి


సర్వే పరిశీలిస్తున్న తహసిల్దార్, ఎంపీడీవో

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని తహసిల్దార్ అంజనేయులు, ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ ఎన్యూమ రేటర్‌లకు సూచించారు. గురువారం మండలంలోని ఉప్లూర్, రాజరాజేశ్వరి నగర్, హసకొత్తూర్ గ్రామాలలో జరుగుతున్న సర్వేను వారు పరిశీలించారు. ఈనెల 18న సర్వే ముగించాల్సి ఉంద,ని ఈలోపు ఎన్యూమరేటర్లు తమకు కేటాయించిన అన్ని కుటుంబాలకు కచ్చితంగా వెళ్లి సరైన వివరాలను నమోదు చేసి సకాలంలో పూర్తి చేయాలని వారు పేర్కొన్నారు. నిర్దేశిత గడువులోగా ఏ ఒక్క కుటుంబం కూడా మిగిలిపోకుండా కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సదానంద్, ఐకెపి ఏపీఎం కుంట గంగాధర్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ధర్పల్లి: మండలంలోని నడిమి తండా, మద్దుల్ తండా, హెూన్నజీపేట, వాడి గ్రామాల్లో ఇంటిటి సర్వే కొనసాగింది. అధికారులు చేపడుతున్న సర్వేను ఎంపిడిఓ బాలక్రిష్ణ, ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, తప్పులు లేకుండా వివరాలు నమోదుచేయాలని ఆదేశిస్తూ సర్వేను పరిశీలిస్తున్నారు.

రెంజల్: రెంజల్ మండలంలోని సాటాపూర్, నీలా, కందకుర్తి గ్రామాలలో సమగ్ర కుటుంబ సర్వేను తహసిల్దార్ శ్రావణ్ కుమార్ పరిశీలించారు. సర్వేను వేగవంతం చేయాలని సిబ్బందికి ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తగా కుటుంబ వివరాలను పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మహబూబ్ అలీ, సిహెచ్ సాయిలు, రెవెన్యూ సిబ్బంది గౌతం, అంగన్వాడి టీచర్ శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుటుంబ సర్వేను పరిశీలించిన మండల ప్రత్యేకాధికారి

బోధన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను గురువారం బోధన్ మండల ప్రత్యేక అధికారి జిల్లా ఆడిట్ అధికారి విజయకుమార్ ఎరాజ్ పల్లి గ్రామంలో జరుగుతున్న సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వేను వేగంగా , స్పష్టంగా తప్పులు లేకుండా చేయాలని ఎన్యుమరేటర్లను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో బాల గంగాధర్, ఎంపీవో మధుకర్, ఏపీవో హేమలత, పంచాయతి సెక్రటరీ సతీష్ గ్రామస్థులు ఉన్నారు.

మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

- ఎంఈఓకు వినతి

నవతెలంగాణ-రెంజల్

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు వంట చేసి పెడుతున్న మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికురాలిని పురుగులు వచ్చాయన్న నెపంతో ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించడం శోచనీయమని సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్, మధ్యాహ్న భోజన ఏజెన్సీ జిల్లా అధ్యక్షురాలు సిహెచ్ లక్ష్మి పేర్కొన్నారు. గురువారం మండల విద్యా వనరుల కేంద్రంలో మండల విద్యాశాఖ అధికారి కట్ట ఆంజనేయులకు వారు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 14 సంవత్సరాలుగా మధ్యాహ్న భోజన కార్మికులు అప్పులు చేసి విద్యార్థులకు సమయానుకూలంగా భోజనం అందించినప్పటికీ ఎలాంటి సంజాయిషీ లేకుండానే తొలగించడం శోచనీయమన్నారు. తొలగించిన మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని లేని ఎడల పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. వారి వెంట సిఐటియు నాయకులు గోపి, మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు సుమేధ, తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

షుగర్ వ్యాధి గురించి భయపడాల్సిన అవసరం లేదు

- చికిత్స తీసుకొని వ్యాధిని అదుపులో ఉంచుకోవాలి
- సన్‌రైస్ ఆసుపత్రిలో షుగర్ వ్యాధిపై పేషెంట్లకు అవగాహన

నవతెలంగాణ-కంఠేశ్వర్

షుగర్ వ్యాధి గురించి భయపడ వలసిన అవసరం లేదని, వ్యాధి వచ్చాక వైద్యుని పర్యవేక్షణలో చికిత్స తీసుకొని వ్యాధిని అదుపులో ఉంచుకోవాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు దామోదర్ రావు అన్నారు. ఈ మేరకు గురువారం నిజామాబాద్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్, భారతీయ పిల్లల వైద్యుల సంఘం వారి సంయుక్త ఆధ్వర్యంలో వేర్వేరు ప్రాంతాల్లో స్నేహ సొసైటీ భవనంలో భారతదేశ మొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం షుగర్ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖలీల్‌వాడి ప్రాంతంలో సన్ రైజ్ ఆసుపత్రిలో అంతర్జాతీయ డయాబెటిక్ దినోత్సవం సందర్భంగా షుగర్ వ్యాధిపై పేషెంట్లుకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎంఏ అధ్యక్షులు దామోదర్ రావు, ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, ఐఏపి నిజామాబాద్ ప్రధాన కార్యదర్శి నేతి బాలేష్ మాట్లాడుతూ.. షుగర్ వ్యాధి గురించి భయపడ వలసిన అవసరం లేదని, వ్యాధి వచ్చాక వైద్యుని పర్యవేక్షణలో చికిత్స తీసుకొని వ్యాధిని అదుపులో ఉంచు కోవాలని అన్నారు. జంక్ ఫుడ్ కాకుండా ఆరోగ్య కరమైన ఆహారాన్ని సరైన సమయంలో తీసుకుంటే ఈ వ్యాధిని నయం చేయవచ్చునని అన్నారు. ప్రతి రోజూ వ్యాయామం చేయడంతోపాటు జీవన శైలిలో మానసిక ఒత్తిడి తగ్గించుకోవడం యోగా, ప్రాణాయామం చేయడంవల్ల షుగర్ వ్యాధిని నివారించవచ్చు అన్నారు. కార్యక్రమంలో కోశాదికారి డా. రాజేంద్ర ప్రసాద్, డా. అజ్జ శ్రీనివాస్, డా. వినోద్ కుమార్ గుప్తా, డా. వినయ కుమార్, డా. రాఘవేంద్ర, డా. గాంధీ, డా. గోపి కృష్ణ, డా. శ్రీధర్ రావు, డా. అర్చన, స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య, ప్రిన్సిపల్ జ్యోతి, వైస్ ప్రిన్సిపల్ రాజేశ్వరి, సిబ్బంది 275 మంది విద్యార్థులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న వైద్యులు

లగచర్లలో దాడికి పాల్పడిన వాళ్లను కఠినంగా శిక్షించాలి

- టిజిఈజెఎసి నిజామాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిరసన
- మద్దతు తెలిపిన ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సంఘాలు

నవతెలంగాణ-కంఠేశ్వర్



విధి నిర్వహణలో భాగంగా వికారాబాద్ జిల్లా లగచర్ల గ్రామసభలో పాల్గొనడానికి వచ్చిన వికారాబాద్ జిల్లా కలెక్టర్, కొడంగల్ ఏరియా డెవలప్మెంట్ అథారిటీ ప్రత్యేక అధికారి, కొడంగల్ తహసీల్దార్, ఇతర రెవెన్యూ సిబ్బందిపై దాడిని తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు నిజామాబాద్ జిల్లా పక్షాన గురువారం నిరసన వ్యక్తం చేశారు. దాడులకు పాల్పడడం వంటి హేయమైన చర్యల వల్ల ఉద్యోగులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని, వారికి భద్రత లేకుండా పోతుందని వారు వాపోయారు

ప్రభుత్వం వెంటనే స్పందించి, కుట్ర పూరితంగా దాడులకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, కేఏడీఏ ప్రత్యేక అధికారి, కొడంగల్ తహసీల్దార్, ఇతర రెవెన్యూ సిబ్బందిపై దాడికి గాను ప్రభుత్వం వెంటనే స్పందించి, ప్రభుత్వ ఉద్యోగులపై దాడులను అరికట్టేలా కఠిన నిర్ణయాలు తీసుకొని ప్రభుత్వ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులపై జరిగిన దాడిని తెలంగాణ ఉద్యోగ సమాజంపై జరిగిన దాడిగా భావిస్తున్నామని ఉద్యోగ సంఘం నిజామాబాద్ జిల్లా నాయకులు తెలిపారు. తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల, జేఏసీ రెవెన్యూ ఉద్యోగులకు సంఘీభావంగా తెలంగాణ ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల జేఏసీ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా నూతన సమీకృత కలెక్టర్ కార్యాలయాల సముదాయం ఆవరణలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ధర్నాలో పాల్గొని, నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్, జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్ , టీజీవో జిల్లా అధ్యక్షులు అలుక కిషన్, కార్యదర్శి సంగం అమృత్ కుమార్, ట్రెస జిల్లా అధ్యక్షులు రమన్ రెడ్డి, కార్యదర్శి ప్రశాంత్, పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి, కార్యదర్శి కిషన్ డిస్టిక్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు యోహన్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షులు రవీందర్, టీఎన్జీవో కేంద్ర బాధ్యులు గైని గంగారం, పోల శ్రీనివాస్, మచ్చుకూరి సతీష్, దివ్యాంగుల ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, తదితరులు ఉద్యోగులు పాల్గొన్నారు.

రైస్ మిల్లులో పనిచేయని ప్యాడి క్లియర్ మిషన్లు

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు మండలంలోని ఇసన్నపల్లి గ్రామంలో రైస్ మిల్లు ఇండస్ట్రీస్‌లో ప్యాడి క్లియర్ మిషన్లు పనిచేయడం లేదని రైతుల ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు పండించిన ధాన్యాన్ని అమ్ముకునే రైతులకు అడుగడుగునా అవంతరాలు ఎదురవుతున్నాయని, రైతుల దగ్గర 14 శాతం తేమ వస్తుంటే రైస్ మిల్లులో 17 శాతం వస్తుందని మిల్లు యజమానులు ధాన్యాన్ని తీసుకోమని చెబుతున్నారని రైతులు తెలిపారు. అనంతరం రైతులు, మరో మిషన్ ద్వారా తేమ శాతం గుర్తించాలని కోరగా మెదక్ జిల్లా రామాయంపేట నుంచి తీసుకొచ్చిన మిషన్ తో చెక్ చేస్తే 14 శాతం రావడంతో మిల్లు యజమానుల పై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ గొడవకు దిగారు. వెంటనే అధికారులు స్పందించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని రైస్ మిల్లర్లకు తెలియజేయడంతో గొడవ సద్దుమనిగింది.

కొనసాగుతున్న సమగ్ర సర్వే

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కుల గణన సమగ్ర సర్వే లో భాగంగా గురువారం నాడు ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని 11 వ వార్డులో శరవేగంగా సర్వే కొనసాగుతోంది. సర్వే నిర్వహిస్తున్న ఎన్యుమరేటర్లు సర్వే పట్ల ప్రజలకు ఉన్న అపోహలను తొలగించడానికి తగిన విధంగా అవగాహన కల్పిస్తున్నారని స్థానికులు తెలిపారు. కుటుంబంలోని ప్రతి వ్యక్తి వివరాలను సేకరించి సర్వే నిర్వహిస్తున్నామని, సమగ్ర సర్వేకు స్థానికులు సహకరించడంతో వేగవంతంగా సర్వే కొనసాగుతుందని ఎన్యుమరేటర్లు తెలిపారు.

నిజమైన గోసంగీలను సర్వేలో నమోదు చేయాలి

- గోసంగి సంఘం జిల్లా అధ్యక్షులు సుంకరిపల్లి సాయన్న

నవతెలంగాణ-బోధన్

నిజమైన గోసంగీ కులస్థులను మాత్రమే సర్వేలో గోసంగీలుగా నమోదు చేయాలని గోసంగి సంఘం జిల్లా అధ్యక్షులు సుంకరిపల్లి సాయన్న అన్నారు. గురువారం సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సుంకరి పల్లి సాయన్న, జిల్లా గౌరవ అధ్యక్షులు మల్లెల సాయిచరణ్ మాట్లాడుతూ.. గోసంగి కులానికి సంబంధం లేని బేడ, బుడగ జంగాల కులానికి చెందిన వారు 30 సంవత్సరాల నుంచి గోసంగీ కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకుంటున్నారని తెలిపారు. 2016 నుంచి తమ వర్గం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నామని గత రెండు నెలల క్రితం నిజామాబాద్ జిల్లా కలెక్టర్ డీఎల్ఎస్సీ కమిటీ ఏర్పాటు చేస్తూ అడిషనల్ కలెక్టర్‌కి ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ప్రస్తుతం, రెవెన్యూ అధికారులు పరిశీలన చేస్తున్నారన్నారు. నవిపెట్ మండలంలో హనుమాన్ ఫారం గ్రామంలో మాత్రమే గోసంగీ కులస్తులు ఉన్నారని వీరిని మాత్రమే కుల గణనలో గోసంగీలుగా నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మోహన్, కోశాధికారి ధర్మపురి, కార్యదర్శిలు వెంకటేష్, నర్సయ్య, మల్లేష్, శషి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మధుమేహ పరీక్షలు

నవతెలంగాణ-ఆర్మూర్

లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ డయాబెటిస్ డే సందర్భంగా గురువారం పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ పార్క్‌లో ఉచితంగా మధుమేహ రక్త పరీక్షలు నిర్వహించారు. 50 మందికి పైగా ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షులు చెరుకు పృథ్వీరాజ్, కోశాధికారి నారాయణ గౌడ్, ప్రాజెక్టు చైర్మన్ కొంగి మనోహర్, సభ్యులు గుర్రం విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

పోచారంలో ఉచిత కంటి వైద్య శిబిరం

నవతెలంగాణ-ఎడపల్లి.

మండలంలోని పోచారం గ్రామంలో గురువారం లయన్స్ క్లబ్స్ ఆఫ్ ఎడపల్లి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన సుమారు 53 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారికి ఉచితంగా కంటి పరీక్షలను వైద్యులు నిర్వహించారు. 13 మందికి మోతి బిందు ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. మిగితా వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంటి వైద్యులుసతీష్, జిల్లా ఆర్గనైజర్ సూర్యనారాయణ, రీజనల్ చైర్మన్ గంగారెడ్డి, క్లబ్ ప్రతినిధులు మనోజ్ కుమార్, కదం ప్రకాష్ రావు, మెర్సీ, బంజశంకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-డిచ్‌పల్లి

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో ఆర్మూర్ గురుకుల పాఠశాలలో అండర్-14, 17 సాఫ్ట్ బాల్, బేస్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు డిచ్‌పల్లి మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి పరిధిలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు డాక్టర్ పి.దశరథ్, పిడి సంజీవ్ గురువారం తెలిపారు. సాఫ్ట్ బాల్ అండర్ -17లో కళ్యాణ్, అండర్ -24 సాఫ్ట్ బాల్‌లో సాయి వినయ్, బేస్‌బాల్ అండర్-17లో ప్రేమ్‌దాస్, అండర్-14 బేస్ బాల్‌లో కార్తిక్‌లు ఎంపికైనట్లు వారు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను దశరథ్, పిడి సంజీవ్ అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు అశోక్, మహేష్, గంగ ప్రసాద్, రాణి, కుల్దీప్ పాల్గొన్నారు.

కందకుర్తి ఎత్తిపోతల పథకం వద్ద మోటర్లు చోరీ

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి ఎత్తిపోతల పథకం రెండవ స్టేజి వద్ద గుర్తుతెలియని దుండగులు రెండు 5 హెచ్ పి మోటార్లను ఎత్తుకెళ్లినట్లు స్థానిక రైతులు పేర్కొన్నారు. గత వారం రోజుల కిందట కందకుర్తి ఎత్తిపోతల పథకం రైతులే ముందుకు వచ్చి పంట కాలువలను మరమ్మత్తులు చేసుకోవడమే కాకుండా ఒక మోటార్ను మరమ్మలు చేసి నడిపించు కుంటున్నారు. నీలా రైతులకు సాగునీటిని అందించాలన్న తలంపుతో వారు గురువారం సెకండ్ స్టేజి వద్దకు వెళ్లి చూడగా రెండు మోటర్లు ఎత్తుకెళ్లినట్టు తెలిసిందని వారు తెలిపారు. వెంటనే సంబంధిత అధికారులతో పాటు స్థానిక ఎస్సై ఈ .సాయన్నకు సమాచారం అందించారు. అధికారులు రాకపోగా, ఎస్సై సఘటన స్థలానికి విచ్చేసి చుట్టుపక్కల గాలిపు చర్యలు చేపట్టగా ఒక మోటర్ అక్కడ వదిలి వేసి వెళ్లినట్లు తెలిసింది. సంబంధిత అధికారులు ఎత్తిపోతల పథకం ప్రారంభించడానికి నిర్లక్ష్యం వహించడమే కాకుండా మోటార్లకు ఎలాంటి రక్షణ ఇవ్వకపోవడం శోచనీయమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోటర్లు దొంగతనం జరిగాయని నీటిపారుల శాఖ ఏఈ భుజేందేర్ కు సమాచారమిచ్చినప్పటికీ వారు స్పందించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని వారు పేర్కొన్నారు.

రెంజల్ ఆదర్శ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న తెలుగు ఉపాధ్యాయులు అనారోగ్యంతో దీర్ఘ కాలిక సెలవు పై వెళ్ళినందున, తెలుగు ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తులు కోరడం జరుగుతుందని పాఠశాల ప్రిన్సిపల్ ఫిరోజ్ హైదర్ పేర్కొన్నారు. ఏప్రిల్ 23, 2025 విద్యా సంవత్సరానికి గాను తెలుగు ఉపాధ్యాయులు అవసరమని, ఆసక్తి కలవారు మూడు సంవత్సరాలు ఇంటర్ మీడియట్‌కు బోధన చేసి ఉండాలని, ఉపాధ్యాయుడి పోసుకు కావలసిన సంబంధిత ధ్రువీకరణ పత్రాలన్నీ సిద్ధం చేసుకోవాలని ఆయన కోరారు. ఈనెల 18న ఆదర్శ పాఠశాలలో ఉదయం 10 గంటలకు ఆసక్తిగల వారు హాజరుకావాలని ఆయన కోరారు.

సమగ్ర కుటుంబ సర్వే పరిశీలన

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి/నిజామాబాద్ రూరల్



చక్రధర్‌నగర్‌లో సర్వేను పరిశీలిస్తున్న అధికారి

మండలంలోని పుప్పాలపల్లి గ్రామంలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను గురువారం మండల ప్రత్యేక అధికారి ప్రవీణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలని అన్ని వివరాలు సేకరించాలని అన్నారు. సర్వేను పూర్తిగా తొందరగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో పుప్పాలపల్లి సమగ్ర కుటుంబ సర్వే సూపర్వైజర్ దేవిక, ఎన్యు మారేటర్స్, ఐకెపిసిసి బాజన్న, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ రూరల్ మండలంలో ని చక్రధర్‌నగర్ గ్రామపంచాయతీ లో జరుగుతున్న సమగ్ర సర్వే పనులను జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ, ఎంపీడీవో సుబ్రమణ్యం పరిశీలించారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

- ఉమెన్స్ కబడ్డీ పోటీలను ప్రారంభించిన టీయూ వీసీ యాదగిరి రావు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వీసీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మహిళా శక్తి ఈ దేశానికి అవసరమని, అందుకు మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.యాదగిరిరావు అన్నారు. గురువారం తెలంగాణ యూనివర్సిటీలో ఇంటర్ కాలేజ్ కబడ్డీ ఉమెన్స్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టీ.యాదగిరి రావు పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ యూనివర్సిటీలో విద్యతోపాటు ఆటలకు సమ ప్రాధాన్యతను ఇస్తానని తెలిపారు. కళాశాల నుండే క్రీడాకారులను ప్రోత్సహించడం ద్వారా జాతీయ అంతర్జాతీయ స్థాయిలో అత్యంత ప్రతిభ కనబరిచి అనేక పతకాలు సొంతం చేసుకుంటారని అన్నారు. ప్రధానంగా మహిళా శక్తి ఈ దేశానికి అవసరమని, అందుకు మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని తెలిపారు. యూనివర్సిటీ స్థాయిలో విద్యార్థులు క్రీడల్లో శ్రద్ధ పెట్టి, మంచి ప్రతిభను ప్రదర్శించాలని తెలిపారు. భవిష్యత్తులో మంచి నైపుణ్యం కలిగిన కోచ్‌లను నియామకం చేస్తానని తెలిపారు. విద్యతోపాటు విద్యార్థులు క్రీడల్లో పాల్గొన్నట్లయితే వారికి శారీరక, మానసిక వికాసం కలుగుతుందని పేర్కొన్నారు. మహిళలు చదువు తో పాటుగా క్రీడల్లో కూడా ముందుండాలన్నారు. ఈ టోర్నమెంట్ ద్వారా క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకోవడానికి మంచి అవకాశమని, పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ టోర్నమెంట్‌లో విన్నర్‌గా గిరిరాజ్ కళాశాల గెలుపొందింది, రన్నర్ గా యూనివర్సిటీ కళాశాల నిలిచింది. విజేతలకు సర్టిఫికెట్స్, మెడల్స్ టీం ట్రోఫీలను డైరెక్టర్ డాక్టర్ బాలకిషన్ అందచేశారు. ఈ టోర్నమెంట్ నిర్వహణలో యూనివర్సిటీ స్పోర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ బాలకిషన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బీఆర్ నేత, వివిధ కళాశాల ఫిజికల్ డైరెక్టర్స్ పాల్గొన్నారు.

ఎంబిఏ బ్రోచర్ ఆవిష్కరణ

గ్లోబల్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ వీక్- 2024 సందర్భంగా ఈ నెల19న బిజినెస్ మేనేజ్‌మెంట్ డిపార్ట్ మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించే వేడుకల బ్రోచర్ ను గురువారం తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి. యాదగిరి రావు ఆవిష్కరించారు. బిజినెస్ క్విజ్, బిజినెస్ ప్లాన్ పోటీలలో కామర్స్, మేనేజిమెంట్, బిబి విద్యార్థులు పాల్గొని వారి నైపుణ్యాలను ప్రదర్శించాలని వైస్ ఛాన్సలర్ యాదగిరి రావు ఉద్బోధించారు. వేడుకల్లో భాగంగా పోటీలతో పాటు వివిధ కార్యక్రమాలు ఉంటాయని బిజినెస్ మేనేజిమెంట్ విభాగాధిపతి ప్రొఫెసర్ చందుపట్ల ఆంజనేయులు తెలిపారు. కార్యక్రములో ప్రిన్సిపాల్ డాక్టర్ అపర్ణ, డాక్టర్ రాజేశ్వం, డాక్టర్ వాణిలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో బహుమతులు అందుకున్న ఏర్గట్ల విద్యార్థులు



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

నవతెలంగాణ-ఏర్గట్ల

నవంబర్ 14 బాలల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయంలో, రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ సాహిత్య అకాడమీ వారు సంయుక్తంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి కథలు, వచన కవిత్వ పోటీల్లో, ఏర్గట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న అభిలాష్ 3 వేల రూపాయల నగదు బహుమతి, వైష్ణవి, నూనె శ్రీనిధిలకు ప్రోత్సాహక బహుమతులతో పాటు 1000 రూపాయల నగదు బహుమతులు లభించినట్లు తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ కవి అందెశ్రీ, తెలంగాణ సాహిత్య సంగీత అకాడమీ చైర్మన్ అలేఖ్య వచ్చారని, వారి చేతుల మీదుగా బహుమతుల ప్రధానం జరిగిందని అన్నారు. రాష్ట్రస్థాయిలో బహుమతులు పొందిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు కృష్ణాచారి, ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

స్థానిక గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో గ్రంథాలయ అధికారి పూర్ణచందర్ ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలను కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ డాక్టర్ రఫిక్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రంగారత్నం, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ గంగాధర్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్.సి.సి. అధికారి డాక్టర్ రామస్వామి, చరిత్ర విభాగాధిపతి డాక్టర్ రమేష్, అకాడమిక్ సమన్వయ కర్తలు రాజేష్, రాహుల్ వివిధ అధ్యాపకులు అనసూయ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు

నవతెలంగాణ-బాల్కొండ

లయన్స్ క్లబ్ ఆఫ్ బాల్కొండ ఫోర్ట్ వారి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మమతా బావయ్య కాంప్లెక్స్‌లో గురువారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు 25 మందికి కంటి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ బాల్కొండ ఫోర్ట్, బాల్కొండ లయన్స్ అధ్యక్షులు అందే వెంకటగిరి, సాగర్ రెడ్డి, సెక్రటరీ ద్యావతి పోశెట్టి, ట్రెసరర్ కటికె శ్రీనివాస్, ఛ్కాకు లింగం, సభ్యులు చౌటి కిషన్, భూస రత్నాకర్, బరిగేడి మల్లేష్ , అవుసలి లింబాద్రి, ద్యావతి రవి పాల్గొన్నారు.

కుక్క కాటు, పాము కాటు మందులు అందుబాటులో ఉంచాలి

డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ అంజన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కుక్క కాటు, పాము కాటు మందులు ఎళ్లవేళలా అందుబాటులో ఉంచాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ అంజన ఆదేశించారు. గురువారం ఇందల్ వాయి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. వయోవృద్ధుల ఔట్ పేషెంట్లను చూసి చిన్నపిల్లలకు ఇచ్చే వ్యాక్సిన్ పరిశీలించి ఫ్రిజ్జులు ఐఎల్ఆర్, ఐస్ ప్యాక్ లు పరిశీలించారు. అవుట్ పేషెంట్ విభాగం, ఇన్ పేషెంట్ విభాగం పరిశీలించారు. గర్భిణీ స్త్రీలకు రక్త పరీక్షలు నిర్వహించి వారికి హిమోగ్లోబిన్ శాతాన్ని తెలియ జేయాలని ల్యాబ్ టెక్నీషియన్ అనిత రాథోడ్‌కు ఆదేశించారు. కార్యక్రమంలో ఆయుష్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భువన, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జేమ్స్ న్యూటన్, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఆరోగ్య పర్యవేక్షకులు అక్బర్ అలీ, ఆనంద్, స్టాఫ్ నర్సులు ప్రకాష్, గంగమణి ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలనే పఠనాలయ ప్రారంభోత్సవం



మాట్లాడుతున్న ఎంఈవో స్వామి

నవతెలంగాణ - భీంగల్ రూరల్

భీంగల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (గర్ల్స్ హైస్కూల్)లో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసం, పాటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో 'పూలే- అంబేద్కర్ వనాలయం' పేరుతో గ్రంథాలయాన్ని మండల విద్యాధికారి డి,స్వామి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. గ్రంథాలయాన్ని ఉపయోగించుకొని జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఉత్తమ ప్రతిభ ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఇన్చార్జి లింబాద్రి, జాన్ విల్సన్, శివకుమార్, గట్టు ఈశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి క్రీడోత్సవాలు ముగింపు

- హాజరైన 7వ బెటాలియన్ అడిషనల్ డీసీపీ ఎమ్ఐ సురేష్



డీసీపీ సురేష్‌ను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని కంజర శివారులో గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గత నాలుగు రోజుల నుంచి నిర్వహిస్తున్న పదవ జోనల్ స్థాయి క్రీడోత్సవాలు గురువారంతో ముగిసాయి. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 7వ బెటాలియన్ అడిషనల్ డీసీపీ ఎమ్ఐ సురేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇక్కడికి నాలుగు జిల్లాల నుంచి విద్యార్థులు రావడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఇంత మంచి ప్రోగ్రామ్ ఇక్కడ ఏర్పాటు చేసినందుకు జోనల్ ఆఫీసర్ ఫోరెన్స్ రాణి, పాఠశాల ప్రిన్సిపల్ విజయలత లను ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి విద్యార్థి ఈ క్రీడల్లో చక్కటి ప్రతిభ కనబరిచారని గెలుపోటములు సహజమని, ఓటమి అనేది గెలుపునకు పునాదని అన్నారు. ఇక్కడ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోకి వెళ్లాలని తమ కళాశాలకు, తల్లిదండ్రులకు, దేశానికి గొప్ప పేరు తీసుకురావాలని ఆయన కోరారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులకు, పిటి టీచర్లకు, స్కూల్‌కు సంబంధించిన ఫ్యాకల్టీ అందరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. అక్కడికి వచ్చిన డీసీపీ సురేష్ చేతుల మీదగా విన్నర్స్‌కి ప్రైజులను అందించారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు కలిగోట్ విద్యార్థులు



తొర్లికొండ విద్యార్థిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని కలిగోట్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం సాన్విక, పి రాము అండర్ 14 వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు పురుషోత్తమాచారి తెలిపారు. ఈనెల 16 నుండి 18 వరకు చేగుంట మెదక్ జిల్లాలో జరిగే వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా క్రీడాకారులని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సువర్ణ, గ్రామ కమిటీ సభ్యులు, వ్యాయమ ఉపాధ్యాయుడు యాదగిరి , ఉపాధ్యాయ బృందం గ్రామ ప్రజలు అభినందించారు.

ఈనెల 11న కామారెడ్డి జిల్లా జడ్పీహెచ్ఎస్ పేట సంఘంలో జరిగిన ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ అండర్-14 వాలీబాల్ ఎంపిక పోటీల్లో జక్రాన్ పల్లి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొర్లికొండ విద్యార్థి బి. రాజు నిజామాబాద్ జిల్లా జట్టు తరపున పాల్గొని చక్కని ప్రతిభ కనబరిచారు. ఈనెల 16 నుండి 18 వరకు మెదక్ జిల్లా చేగుంట మోడల్ స్కూల్లో జరిగే 68వ స్కూల్ గేమ్స్ రాష్ట్ర వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ మర్కంటి గంగా మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా రాజును ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి ఎం శ్రీనివాస్ అభినందించారు. జిల్లా జట్టును రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలపడానికి కృషి చేసి జాతీయ పోటీలకు ఎంపిక కావాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయిలు,రామకృష్ణ, సునీత,కృష్ణ, మాలతి, గౌతమి, పల్లె గంగాధర్, ఓఎస్ శేఖర్ పాల్గొన్నారు.

మతం రంగుతో విద్వేశాలు రెచ్చగొడుతున్న బీజేపీ

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పద్మ



మాట్లాడుతున్న పశ్యపద్మ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సిపిఐ ఆవిర్భవించి 100 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా డిసెంబర్ 26న పార్టీ, ప్రజాసంఘాలు ఆవిర్భావ ఉత్సవాలు నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం కె.భూమయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పద్మ మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న మతోన్మాద బిజెపి దళితులపై, ఆదివాసీలపై, మహిళలపై, మైనార్టీలపై దాడులను పెంచిందని ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పదేండ్లు దాటిన రాష్ట్ర పునర్విభజన చట్టంలో పేర్కొన్న హామీలను అమలు చేయలేదని తెలిపారు. తెలుగు రాష్ట్రానికి సంబంధించిన ప్రొఫెసర్ సాయిబాబపై నిరంకుశ చట్టాలను ప్రయోగించి ఆయన జీవితాన్ని జైలుపాలు చేసిన ఘనత బీజెపికె దక్కుతుందని అన్నారు. మహత్తర తెలంగాణ రైతాంగ పోరాటానికి మతం రంగు పూసి విద్వేషాలను రెచ్చగొడుతున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పార్లమెంటులో బిల్లు పెట్టాలని పోరాటం చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆట-పాట-మాట ఉద్యమంతో ప్రజల వద్దకు వెళ్లిన పార్టీ సిపిఐ అని అన్నారు. సిపిఐ 100వ ఆవిర్భావదినోత్సవం సందర్భంగా జిల్లాలో కూడా పార్టీ, ప్రజాసంఘాల నాయకులు ఉత్సవాలను వాడ, వాడల జరిపాలని నాయకత్వాన్ని కోరారు. ఈ ప్రెస్‌మీట్‌లో సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, సిపిఐ జిల్లా నాయకులు వై.ఓమయ్య, ఏ.రాజేశ్వర్, వై.రాజిరెడ్డి, కే.రాజన్న, మంద.స్వరూపరాణి, రాందాస్, పాల్గొన్నారు.

నెహ్రూ దేశానికి చేసిన సేవలు మరువలేనివి



నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్/రెంజల్/భీంగల్‌రూరల్

నెహ్రూ దేశానికి చేసిన సేవలు ఎన్నటికీ మరువలేనివని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహేర్ బిన్ హందాన్ అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ భవన్‌లో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా నెహ్రూ చౌక్‌లోని నెహ్రూ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతా రెడ్డి రాజారెడ్డి, మాజీ పీసీసీ కార్యదర్శి రాంభూపాల్, జిల్లా సేవదళ్ అధ్యక్షులు సంతోష్, నగర మహిళా కమిటీ అధ్యక్షురాలు రేవతి, నగర ఎస్టీ సెల్ అధ్యక్షులు సుభాష్ జాదవ్, డిసిసి డెలిగేట్ లవంగ ప్రమోద్, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

భీంగల్‌రూరల్: భారత తొలి ప్రధాన మంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా గురువారం భీంగల్ మండల కేంద్రంలో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నెహ్రూ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. 'జాతీయ బాలల దినోత్సవం' సందర్భంగా నాయకులు బాలబాలికలకు అందరికీ హార్థిక శుభాకాంక్షలు తెలియజేశారు. పిల్లలు జాతి సంపదగా భావించి అందరూ వారి భవితవ్యానికి కృషి చేయాలని బోధించిన పండిట్ నెహ్రూ ఆకాంక్షల మేరకు నేటి పిల్లలను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొదిరే స్వామి, టౌన్ అధ్యక్షుడు జేజే నర్సయ్య కోరారు. నెహ్రూ చిత్రపటానికి నివాళులు అర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎళ్లవేళలా అందుబాటులో ఉండాలి

డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజన

నవతెలంగాణ-ధర్పల్లి



మాట్లాడుతున్న డిప్యూటీ డిఎంహెచ్‌వో

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని నిజామాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా..అంజన తెలిపారు. గురువారం ఆమె మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ఈసందర్భంగా ఆస్పత్రిలో జరుగుతున్న ప్రసవాలు వాటికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు అలాగే ఐపి,ఓపి, డెలివరీ రిజిస్టర్‌లను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఆస్పత్రిలో సిబ్బంది ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్.మౌనిక, సి.హెచ్.ఓ జేమ్స్, డిపిఎంఓ శ్రీనివాస్, నర్సింగ్ ఆఫీసర్స్ దినేష్, సుజాత, హెల్త్ సూపర్‌వైజర్ భూలక్ష్మి, సిబ్బంది మురళి, సంతోష్, వాజిద్, లత, పూజ, రాము, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారులు



శ్రీభాషిత పాఠశాలలో..

ఆకట్టుకున్న బాలలదినోత్సవ సంబురాలు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కి టు ఎంఆర్ గార్డెన్‌లో గురువారం బాలల దినోత్సవ సంబరాలు సంబరంగా నిర్వహించారు. చిన్నారుల ఆట పాటలతో చూపరులను ఎంతో అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పోలపల్లి సుందర్, ప్రిన్సిపాల్ పాఠశాల ఉపాధ్యాయ బృందం, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పట్టణంలోని పలు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో గురువారం బాలల దినోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించినారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో, మామిడిపల్లి హై స్కూల్, స్మైల్, కృష్ణవేణి, బ్రిలియంట్, బ్లూ బర్డ్స్ స్కాలర్స్, ఆక్స్ఫర్డ్, లిల్లీపుట్ పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో లిల్లీపుట్ రామకృష్ణ, ప్రిన్సిపాల్ దాసు, ఆక్స్ఫర్డ్ పాఠశాల యాజమాన్యం మానస గణేష్, స్మైల్స్ రఫీ గోహార్, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో..



లిల్లీపుట్ పాఠశాలలో..

రైతుల కోసమే సహకార సంఘాలు

- జిల్లా వ్యాప్తంగా సహకార వారోత్సవాలు

నవతెలంగాణ-విలేకరులు

జిల్లా వ్యాప్తంగా సహకార సంఘాల వారోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. 71 వ అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా సొసైటీ కార్యాలయాల్లో చైర్మన్‌లు జెండాలను ఆవిష్కరించారు. రైతుల కోసమే సహకార సంఘాలు పని చేస్తున్నట్టు పలువురు పేర్కొన్నారు.

లింగంపేట్ : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ముందు చైర్మన్ కూచంపల్లి దేవేందర్ రెడ్డి జెండా ఆవిష్కరించారు. రైతు సహకార సంఘంలో సభ్యులు కావాలని రైతులకు అండగా సహకార సంఘం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మకం రాములు, డైరెక్టర్లు, సీఈఓ పెంటయ్య, సిబ్బంది దుర్గ ప్రసాద్, అనిల్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పిట్లం : సహకార సంఘాలతో రైతులు మనుగడ సాధిస్తున్నారని చిల్లర్గి సహకార సంఘం అధ్యక్షులు శపథం రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సహకార సంఘం ఆధ్వర్యంలో 71 అఖిల భారతీయ సహకార వారోత్సవాల దృష్ట్యా జాతీయ పథకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సహకార సంఘాల వల్ల రైతులు అభివృద్ధి బాటలో పయనిస్తున్నారని కొని యాడారు. సహకార సంఘాలు రైతులకు రబ్బీ, ఖుష్కి పంటలకు గాను స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు, పండించిన పంటలకు ప్రభుత్వ పరంగా గిట్టుబాటు ధర కల్పిస్తూ కొనుగోలు చేపట్టడం, యంత్ర సామాగ్రిలను అందజేస్తూ వారి మనుగడకు నిత్యం కృషి చేస్తున్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సహకార సంఘాల క్లస్టర్ అధికారి మురళీధర్ గౌడ్, వైస్ చైర్మన్ డాకూరి వెంకట్‌రెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మా రెడ్డి కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



భిక్కనూర్ సొసైటీలో జెండా ఆవిష్కరించిన సొసైటీ చైర్మన్


పిట్లంలో..

రైతుల సౌలభ్యం కోసమే సొసైటీ వ్యవస్థ

భిక్కనూర్ : రైతుల సౌలభ్యం కోసం సహకార వ్యవస్థను అప్పటి ప్రభుత్వాలు తీసుకువచ్చాయని మండలంలోని అంతంపల్లి సింగిల్ విండో సొసైటీ చైర్మన్ వలకొండ వెంకట్ రెడ్డి తెలిపారు. స్థానిక సింగిల్ విండో సొసైటీ కార్యాలయ ఆవరణలో సహకార జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, సొసైటీ సీఈఓ శ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

ప్రాథమిక సహకార సంఘాల వారోత్సవాలు

సదాశివనగర్ : మండలంలోని అడ్లూరు ఎల్లారెడ్డి, ఉత్నూరు, సదాశివనగర్, పద్మాజివాడి సహకార సంఘాలలో అధ్యక్షులు సదాశివరెడ్డి, ప్రభాకర్‌రావు, కమలాకర్‌రావు, గంగాధర్ జెండాలను ఆవిష్కరించారు. ఈ వారోత్సవాలను వారం రోజులు నిర్వహిస్తారని అధ్యక్షులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈవోలు భైరయ్య, నయీం, విఘ్నేష్‌గౌడ్, దేవేందర్, డైరెక్టర్లు రైతులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్ : మండల కేంద్రంలోని గల సింగిల్ విండో కార్యాలయంలో ఆల్ ఇండియా కోఆపరేటివ్ వారోత్సవాలు భాగంగా ఏడు రంగుల జెండాను సింగిల్విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. సింగిల్ విండోల ద్వారా వ్యవసాయ రైతులకు రుణ సౌకర్యాలు గాని ఎరువులు విత్తనాలు గాని అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ వారోత్సవాలకు సింగిల్ విండో పాలకవర్గం సభ్యులు హాజరయ్యారు. సంఘం కార్యదర్శి జె.బాబురావు, సింగిల్ విండో సిబ్బంది పాల్గొన్నారు.



లింగంపేట్‌లో జెండా ఆవిష్కరించిన సొసైటీ చైర్మన్..


సదాశివనగర్ పద్మాజివాడి సొసైటీలో..


మద్నూర్ మండల కేంద్రంలో..

ఎంఈవోకు సన్మానం


ఎంఈవోను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ఐలాపూర్ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాధికారి శౌకత్ అలీ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి నాస్ ఎగ్జామ్ గురించి పలు చూచనలు సలహాలు ఇచ్చారు. నాస్ బోధన తరగతులను పరిశీలించారు. పాఠశాల నిర్వహణ, ఉపాధ్యాయుల పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారిని ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

సమయం తక్కువ.. సమాచారం సేకరణ ఎక్కువ


- సర్వేలో సమస్యలు ఎదుర్కొంటున్న ఎన్యుమరేటర్లు
- తెలంగాణ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్(టిఎస్‌పిటిఏ) జిల్లా అధ్యక్షులు

నవతెలంగాణ-కామారెడ్డి

సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలను చేయడంలో ఎన్యుమరేటర్లు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలంగాణ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దుబాసి నరేందర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేకు సమయం తక్కువ, సమాచా సేకరణ ఎక్కువ ఉండడంతో మానసిక సంఘర్షణ గురవుతున్నటువంటి ప్రాథమిక ఉపాధ్యాయులూ. ఉదయం పూట పాఠశాలకు వెళ్లి మధ్యాహ్నం ఒకటి నుంచి ఐదు గంటల వరకు చేస్తే దాదాపు పది ఇళ్ల కంటే ఎక్కువ తిరిగే పరిస్థితి లేదన్నారు. సమయం తక్కువగా ఉండటం వల్ల టార్గెట్ రీచ్ కావడం కోసం ఉదయమే 7 గంటల వరకు సర్వే స్టార్ట్ చేస్తున్నట్టు తెలిపారు. సాయంత్రం ఏడు గంటల వరకు కొనసాగుతుంది. దాదాపు చాలా గ్రామాల్లో ఇట్లాంటి పరిస్థితులలో చాలామంది ఎన్యుమరేటర్లు వయసులో పెద్దవారు, మహిళలు ఉన్నారు, వీరికి చాలా ఇబ్బంది అవుతుందన్నారు.

అధికారులు కొందరికి ఎక్కువ ఇండ్లు, కొందరికి తక్కువ ఇండ్లు కేటాయించారని, దీనిని కూడా సవరించాల్సిందిగా కోరుతున్నామని తెలిపారు. అధికారులు దృష్టి సారించి కుదిరితే సమయాన్ని పొడిగించండి. లేదంటే సిబ్బందిని పెంచాలని కోరారు. సిబ్బంది కోసం ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నటువంటి సిలబస్ పూర్తి అయిన టీచర్లు కావచ్చు, పీఈటీలు, పీడీలు, పిటిఎఫ్ స్టాఫ్ అవకాశం ఉన్న వారిని ఆయా గ్రామాల్లో సర్దుబాటు చేసినట్లయితే ప్రాథమిక పాఠశాల టీచర్లకు కొంత వెసులుబాటు దొరికే అవకాశం ఉంటుందన్నారు. ప్రాథమిక పాఠశాలు నిర్వీర్యం కాకుండా కనీసం ఒక్క పూట నైనా సక్రమంగా నడిచే అవకాశం ఉంది. కాబట్టి ఈ విషయాన్ని నేను అధికారుల, ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తున్నాను అన్నారు.

పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు


సీసీ కెమెరాలు బిగిస్తున్న సిబ్బంది

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని బస్వాపూర్ గ్రామంలో గతంలో యువతపై జరిగినట్టి దాడులను అణచివేతలను, తమపై మోపబడిన నిరాధార నిందలను దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తులో ఎలాంటి దుర్ఘటనలు కాకూడదనే సదుద్దేశంతో యువత ఒక నవాయుగానికి నాంది పలుకుతు మొదటి అడుగులు వేస్తూ ఒక మంచి కార్యానికి శ్రీకారం చుట్టింది. దానికి ప్రతీకగా దైవంలాగ భావించే స్కూలు క్రీడాప్రాంగణంలో ఎలాంటి ఆస్తుల ధ్వంసం కాకూడదని, విద్యార్థుల రక్షణ నిమిత్తం స్కూల్లో జరిగినట్టి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో తీర్మానించి యూత్ ఫర్ యూనిటీ ద్వారా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గ్రామ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం పట్ల గ్రామస్తులు యూత్ ఫర్ యూనిటీ సభ్యులను అభినందించారు.